ప్రతిపక్షం
www.prathipaksham.in

బుధవారం 14.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 295 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



గుజరాత్ జెయింట్స్‌పై ముంబయి గెలుపు 10

సీఎం రేవంత్ అసభ్య ఫోటోల కేసు

ఎనిమిది మందితో సిట్



మహిళా ఐఏఎస్‌ను కించపరిచిన న్యూస్‌పైనా సర్కారు సీరియస్

రెండు న్యూస్ ఛానెల్స్ సహా ఏడు యూట్యూబ్ ఛానెళ్లపై కేసు నమోదు

సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ ఉత్తర్వులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 13: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోలను అసభ్యకరంగా రూపొందించి వాట్సాప్‌గ్రూప్‌ల్లో పోస్ట్ చేసిన వ్యవహారం, మహిళా ఐఏఎస్ అధికారినిని కించపరిచిన కేసులో విచారణ చేసేందుకు ప్రభుత్వం ఎనిమిది సభ్యలతో కూడిన ప్రత్యేక విచారణ బృందం(సిట్) ఏర్పాటు చేసింది. నారాయణపేట జిల్లా మద్దూర్, హైదరాబాద్‌లోని సీసీఎస్‌లో నమోదైన కేసులపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. మహిళా ఐఏఎస్ అధికారినిని కించపరిచిన కేసు, నారాయణపేట్ మద్దూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులను ఈ సిట్ దర్యాప్తు చేయనుంది. ఈ మేరకు డీజీపీ శివధర్ రెడ్డి హైదరాబాద్ సీపీ సజ్జనార్ పర్యవేక్షణలో ఎనిమిది మంది పోలీసు అధికారుల బృందంతో సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎం ఫోటోలను మార్ఫింగ్ చేసిన కేసు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోలను ...:: మిగతా 2లో



దుర్వినియోగం చేస్తే నియంత్రించాల్సిందే

జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే వార్తల ప్రసారాన్ని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఖండించారు. ఐఏఎస్ అధికారిణుల పట్ల అసభ్యంగా రాయడం గర్హనీయం అని మండిపడ్డారు. భావ ప్రకటన స్వేచ్ఛ సమాజానికి ప్రాణవాయువులాంటిదన్న ఆయన రాజ్యాంగం పరిమితుల్లేని స్వేచ్ఛకు హామీ ఇవ్వలేదని పేర్కొన్నారు. బాధ్యత లేకుండా భావప్రకటన స్వేచ్ఛను వినియోగించరాదని దానిని దుర్వినియోగం చేస్తే నియంత్రణ కూడా అదేస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. భావప్రకటన స్వేచ్ఛ విషయంలో స్వీయ నియంత్రణ చాలా అవసరమని తెలిపారు. సమర్థంగా పనిచేసే యువ అధికారిణులపట్ల అమర్యాద తగదని సూచించారు. భావప్రకటన స్వేచ్ఛ పేరిట ఇతరుల వ్యక్తిత్వాన్ని దెబ్బ తీయకూడదని, పురుషాధిక్య భావజాలంతో దుశ్చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

రెండేళ్లలో 9,572 ఉద్యోగాలు భర్తీ చేశాం

చివరి దశలో మరో 7,267 ఉద్యోగాల భర్తీ

త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు ఇస్తాం



- ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రతి పోస్టునూ రిక్రూట్ చేస్తాం
- ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికైన 1,257 మందికి నియామక పత్రాల అందజేత
- ప్రతి పౌరునికి మెరుగైన వైద్య సేవలు అందిస్తాం
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 13 : గతంలో ఎన్నడూ లేని విధంగా వేగంగా ఉద్యోగ నియామక ప్రక్రియను పూర్తి చేశామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. 2024 సెప్టెంబర్ 11న నోటిఫికేషన్ విడుదల చేయగా, 2025 నవంబర్ నాటికి నియామక ప్రక్రియను పూర్తి చేశామన్నారు. మొత్తం 23,323 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 1,257 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని మంత్రి తెలిపారు. డీఎంఈ పరిధిలో 764, డీపీహెచ్‌లో 300, టీవీవీపీలో 180, ఎంఎన్‌జేలో 13 మందికి పోస్టింగ్స్ ఇచ్చామన్నారు. మంగళవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో నియామక పత్రాలు అందజేత కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌లతో కలిసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

రోగ నిర్ధారణ తర్వాతే చికిత్స...

"ఒకప్పుడు రోగి లక్షణాలను బట్టి వైద్యం చేసేవారు. కానీ నేడు రోగ నిర్ధారణ జరిగిన తర్వాతే చికిత్స ప్రారంభిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు ...:: మిగతా 2లో



ట్రంప్‌కు ఇరాన్ స్ట్రాంగ్ కౌంటర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలకు కౌంటర్ ఇచ్చింది ఇరాన్. శత్రువుల గురించి తమకు తెలుసని, తాము బలంగా ఉన్నామని హెచ్చరించింది. వారిని ఎదుర్కోనేందుకు మేం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ చెప్పారు

9



విజయ్‌కు సీబీఐ సెకండ్ నోటీస్

కరూర్ తొక్కిసలాట కేసులో టీవీకే అధినేత, నటుడు విజయ్‌కు సీబీఐ మరోసారి సమన్లు జారీ చేసింది. జనవరి 19న విచారణకు హాజరు కావాలని సూచించింది. ఈ కేసులో సీబీఐ జనవరి 12న విజయ్‌ని విచారించిన విషయం తెలిసిందే.


9



చలితో ఢిల్లీ గజగజ..

ఉత్తరభారతాన్ని చలిపులి వణికిస్తోంది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీ లో ఈ సీజన్‌లోనే అత్యంత కనిష్టానికి ఉష్ణోగ్రతలు పతనమయ్యాయి.

9



రక్తసిక్తమైన ఇరాన్

ఇరాన్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనల్లో భారీ సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఆరు వందల మందికి పైగా చనిపోయినట్లు అధికారిక సమాచారం.

9

పర్యాటక రంగ అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

అట్టహాసంగా ప్రారంభమైన పతంగుల, మిఠాయిల పండుగ



- ప్రారంభించిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్
- సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి వేడుకలు: మంత్రి జూపల్లి
- పర్యాటక రంగం ద్వారా ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 13: పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ పతంగుల, మిఠాయిల పండుగ మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర పర్యాటక, ...:: మిగతా 2లో

త్రివిధ దళాల సమన్వయంతో ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది



...:: 2లో

- ఇప్పటికే కీలక విజయాలు సాధించాం
- రాజకీయ దేశాలు, పూర్తి స్వేచ్ఛతోనే ఆపరేషన్ అమలు
- జమ్మూలో పరిస్థితులు మెరుగుపడుతున్నాయి
- ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



కుంభమేళాకు మించి 'మేడారం' జాతర

- 250 కోట్లకుపైగా నిధులతో పనులు
- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ
- గత జాతరకు కోటిన్నర మంది హాజరు
- ఈ సారి రెట్టింపు భక్తులు వచ్చే అవకాశం
- భక్తులు సులభంగా గమ్యానికి చేరేలా సూచికలు
- జాతరపై కేబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి
- ఏర్పట్లపై సమీక్షించిన మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 13: సమ్మక్క-సారలక్క జాతరను కుంభమేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మహాజాతరను విజయవంతంగా నిర్వహించడం ప్రతి అధికారికి ఒక బాధ్యతగా తీసుకుని, ఏ చిన్న లోపం కూడా లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు ...:: మిగతా 2లో

జాతరకు ఆర్టీసీ ఏర్పాట్లు

- 3,495 ప్రత్యేక బస్సులను నడపనున్న సంస్థ
- సాధారణ ఛార్జీకి 50 శాతం అదనంగా వసూలు
- ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

...:: 2లో

రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తే.. ప్రజలు మిమ్మల్నే అగ్నిగుండంలోకి నెట్టేస్తారు

- అగ్గిపెట్టె పట్టుకుని యువతను రెచ్చగొట్టిన వారు చావలేదు
- కానీ.. అమాయకపు పిల్లల్ని పొట్టనపెట్టుకున్నారు
- శాస్త్రీయంగా లేని జిల్లాల విభజనను తప్పకుండా సరిచేస్తాం
- కేటీఆర్‌వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి మండిపాటు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 13: తెలంగాణ ఉద్యమంలో అగ్గిపెట్టె పట్టుకుని యువతను రెచ్చగొట్టిన వారు చావలేదు కానీ.. అమాయకపు వేలాది పిల్లల్ని పొట్టనపెట్టుకున్నారని మంత్రి ...:: మిగతా 2లో

రాష్ట్రీయం



మహిళా సంక్షేమ పథకాలపై అధికారులతో భవానీ వేముల భేటీ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 13: మహిళా సంక్షేమం కోసం అమలవుతున్న ప్రభుత్వ పథకాలపై అధికారులతో తెలంగాణ జగృతి రాష్ట్ర కార్యదర్శి, మహిళా కమిటీ సభ్యురాలు, ఖ్యాతిస్ ఫౌండేషన్ ఛైర్మన్ భవాని వేముల సమావేశమయ్యారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ జగృతి రాష్ట్ర కార్యదర్శి, మహిళా కమిటీ సభ్యురాలు భవాని వేముల జాయింట్ డైరెక్టర్ ధీరజ్, డైరెక్టర్ ఉదయ్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ సునీతతో సమావేశమయ్యారు. మహిళా సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వంలో అమలవుతున్న పథకాలు, వాటి చట్టపరమైన విధానాలు, అవగాహన కార్యక్రమాలు, సేవల వివరాలను ఈ సందర్భంగా తెలుసుకున్నారు. అనంతరం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), మున్సిపల్ ప్రాంతాల పేదరిక నిర్మూలన మిషన్ (మెప్మా) కార్యాలయాలను సందర్శించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా అమలవుతున్న మహిళా సాధికారత ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలపై వివరాలను ప్రాజెక్ట్ డైరెక్టర్, అదనపు ఇన్‌చార్జి వసంత నుండి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన 'కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తాం' అనే లక్ష్యానికి అనుగుణంగా సెర్ప్, మెప్మా ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో భావాని వేములతో పాటు పద్మమ్మ పాల్గొన్నారు.



డిజిటల్ దుష్ప్రచారాన్ని అడ్డుకునే మార్గాలపై చర్చలు

- **యూరోపియన్ పార్లమెంట్ డీజీ మాంగోల్డ్‌తో తెలంగాణ సీఈవో భేటీ**

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 13: ఎన్నికల సమయంలో తప్పుడు సమాచారం, సోషల్‌మీడియా ఆధారిత దుష్ప్రచారాన్ని అడ్డుకునే అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి యూరోపియన్ పార్లమెంట్ డైరెక్టర్ జనరల్ ఫర్ కమ్యూనికేషన్ క్రిస్టియన్ మాంగోల్డ్‌తో మంగళవారం కీలక భేటీ నిర్వహించారు. ఈయూ ఎన్నికల వ్యవస్థ నిర్మాణం, ప్రజలతో కమ్యూనికేషన్ నిర్వహించే విధానం, ఫేక్ న్యూస్ వ్యాప్తిని నియంత్రించేందుకు యూరోపియన్ యూనియన్ తీసుకుంటున్న సాంకేతిక, విధానపరమైన చర్యలను మాంగోల్డ్ వివరించారు. డిజిటల్ వేదికలపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని గుర్తించి తక్షణమే స్పందించే ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. సీఈవో సుదర్శన్‌రెడ్డి భారత ఎన్నికల విధానాన్ని సమగ్రంగా వివరిస్తూ, వృద్ధులు, దివ్యాంగులు, వలస ఓటర్లు వంటి వర్గాలకు సులభంగా ఓటు హక్కు వినియోగించేలా భారత ఎన్నికల సంఘం అమలు చేస్తున్న నూతన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిర్వహిస్తున్న ఎన్నికల తీరుపై మాంగోల్డ్ ప్రత్యేకంగా ప్రశంసలు వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. జనవరి 2025 నుంచి యూరోపియన్ పార్లమెంట్‌లో డైరెక్టర్ జనరల్ ఫర్ కమ్యూనికేషన్‌గా క్రిస్టియన్ మాంగోల్డ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నికల నిర్వహణలో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయడం, డిజిటల్ యుగంలో ఎన్నికల విశ్వసనీయతను పరిరక్షించడమే లక్ష్యంగా సీఈవో నేతృత్వంలోని తెలంగాణ బృందం యూరప్ పర్యటనలో భాగంగా ఈ భేటీ జరిగినట్లు అధికారులు వెల్లడించారు

రాష్ట్రాన్నిఅగ్నిగుండం చేస్తే..

ప్రజలు మిమ్మల్నే అగ్నిగుండంలోకి నెట్టేస్తారు

మొదటిపేజీ తరువాయి

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌నేతల వ్యాఖ్యలపై మండిపడ్డారు. మంగళవారం సత్తుపల్లిలోని రాణి సెలబ్రేషన్స్ కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన జరిగిన ది సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణను స్వార్థం కోసం మళ్లీ జిల్లాల పేరుమీద ఉద్యమాలు చేస్తాం, అగ్నిగుండాలు చేస్తాం, సామాన్య ప్రజలను బలిచేస్తాం అంటే ఊరుకునే ప్రసక్తే లేదని మంత్రి హెచ్చరించారు. ప్రజలు తెలివైన వారని, అన్నీ గమనిస్తున్నారని అన్నారు. ప్రజల్ని రెచ్చగొట్టి అగ్నిగుండం తయారు చేసి చలి కాచుకుంటామంటే.. ప్రజలు మిమ్మల్నే అగ్నిగుండంలోకి నెట్టెస్తారుంటూ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శాస్త్రీయంగా లేని జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల విభజనను తప్పకుండా సరిచేస్తామని తెలిపారు.

ప్రజాభిష్టం మేరకే విభజన...

శాసనసభలో చర్చించి, రిటైర్డ్ జడ్జి ద్వారా కమిటీ వేసి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, కేబినెట్లో చర్చించి ప్రజలకు అనుకూలమైన విధంగా సరైన పునర్వ్యవస్థీకరణ చేయబోతున్నట్లు మంత్రి తెలిపారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బీఆర్ఎస్ నేతలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా తీరు మార్చుకోకుండా మాట్లాడుతున్నారంటూ ధ్వజమెత్తారు. మొన్నటి పంచాయతీ ఎన్నికల ఫలితాలు చూశాక బీఆర్ఎస్ నాయకులకు మైండ్ బ్లాక్ అయ్యిందన్నారు. ఓటమిని జీర్ణించుకోలేక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారంటూ పొంగులేటి దుయ్యబట్టారు. 10 మంది సర్పంచులను గెలిపించుకుని, కార్యకర్తలందరినీ నిలబెట్టి మేమే గెలిచామని చెప్పుకోవడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే గతి

గతంలో ఎన్నికల ఫలితాలను సెమీ ఫైనల్స్‌గా అభివర్ణించిన మాజీ మంత్రులపై పొంగులేటి నిప్పులు చెరిగారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 69 శాతం సీట్లు గెలిచి కాంగ్రెస్ తన జైత్రయాత్రను చాటిందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఇది 80 శాతానికి మించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం

నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

- **ఈ నెలాఖరు లోపు రూ. వేయి కోట్లు**
- **వచ్చే నెలలో మిగిలిన నిధులు విడుదల చేస్తామన్న కేంద్రం**
- **నిధుల వినియోగం కోసం మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 13: తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో, గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క, అధికారుల నిరంతర కృషి, సంప్రదింపుల ఫలితంగా నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రామ పంచాయితీలకు రావాల్సిన సుమారు రూ. 2500కోట్ల పెండింగ్ నిధులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ఈ నెలాఖరు లోపు కనీసం రూ. వెయ్యి కోట్లను కేంద్రం విడుదల చేయనున్నట్టు సమాచారం. మిగిలిన నిధులను వచ్చే నెలలో విడుదల చేసేందుకు కేంద్రం అంగీకరించిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క ఆదేశాలతో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల నిధులను వెంటనే వినియోగించుకునేలా పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం అన్ని జిల్లాలకు మెమో జారీ చేసి, నిధుల వినియోగంలో డిజిటల్ ప్రక్రియను తప్పనిసరి చేసింది. 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం ప్రతి గ్రామ పంచాయతీ ప్రత్యేక బ్యాంకు ఖాతాను నిర్వహించాల్సి ఉంటుంది. ఆ ఖాతాను పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్‌లో నమోదు చేసి యూనిక్ ఏజెన్సీ కోడ్ పొందాలి. అదే సమయంలో ఈ గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో కూడా ఆ బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేయాలి. నిధుల వినియోగానికి మేకర్, చెకర్‌గా వ్యవహరించే వారి డిజిటల్ సంతకాలను ఈ గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేసి సంబంధిత ఎంపీడీఓ ద్వారా ఆమోదం పొందాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీల్లో ఉపసర్పంచ్ మేకర్‌గా, సర్పంచ్ చెకర్‌గా వ్యవహరిస్తారని ప్రభుత్వం మరో సారి స్పష్టం చేసింది. ఈ ప్రక్రియకు క్లాస్ 3 డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్లు తప్పనిసరి కాగా, సైనింగ్, ఎన్‌క్రిప్షన్ సౌకర్యంతో పాటు యూఎస్బీ టోకెన్ కూడా ఉండాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తయిన తర్వాతే 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకునే అవకాశం ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ స్పష్టం చేసింది. అందువల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లా పంచాయతీ అధికారులు అవసరమైన డిజిటల్ సంతకాలను జీఈఎం పోర్టల్, ఈప్రోక్యూర్‌మెంట్ లేదా ఇతర టెండర్ విధానాల ద్వారా వెంటనే సేకరించి, నమోదు ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి 15 ఆర్థిక సంఘం నిధులను వినియోగించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ శృతి ఓజా అన్ని జిల్లాల పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



చంద్రబాబు నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా మహాశక్తి పథకాన్ని అమలు చేయలేదు. పండుగల పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఆడబిడ్డ నిధి పథకం ప్రకారం 18 నుంచి 59 ఏళ్ల మహిళలకు ప్రతి నెల రూ.1500 ఇవ్వాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి.

- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

కుంభమేళాకు మించి 'మేడారం' జాతర

మొదటిపేజీ తరువాయి

పూర్తి చేయాలని ఆయన సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ జాతరకు రూ.150 కోట్లకుపైగా నిధులు కేటాయించి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతులు, భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు వంటి అన్ని విభాగాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. మేడారం జాతరపై మంగళవారం డా. బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్కలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సవ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, స్వాతి లక్రా, వివిధ శాఖ కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 28నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి గత జాతరకానా రెట్టింపు సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్షణ్ కుమార్, సీతక్క అన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ మాట్లాడుతూ, గత 2024 మేడారం జాతరకు కోటిన్నర మంది హాజరుకాగా, ఈసారి 2026లో జాతరకు దాదాపు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 150 కోట్ల నిధులను మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వివరించారు. ఏ ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, జాతరకు వచ్చే భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో స్పష్టమైన దిశా సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని, ప్రత్యేక రూట్ మ్యాప్‌లతో పాటు అవసరమైన చోట వన్‌వే వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. ఈ జాతరపై కేబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇలాంటి స్థాయి సమిష్టి పర్యవేక్షణ గతంలో ఎప్పుడూ జరగలేదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా వసతి, పార్కింగ్, రవాణా సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ విషయంలో వీఐపీలు-సామాన్య భక్తులు అనే తేడా లేకుండా, అందరికీ సమాన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. మంత్రి దనసరి సీతక్క మాట్లాడుతూ, ఈసారి జాతర ఏర్పాట్లకు రూ. 150కోట్లతో పాటు గద్దెల పునరుద్ధరణ పనులకు రూ. 101కోట్లు మొత్తం 251 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేశారని వివరించారు. జాతరకు వచ్చే ప్రతీ భక్తులకు సాఫీగా దర్శనం లభించేలా ప్రాధాన్యత నిస్తున్నట్టు అన్నారు. ఇందుకు ప్రతీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖ కార్యదర్శులు, హెచ్‌ఓడీలతో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ను ఏర్పాటు చేసి జాతర నిర్వహణపై ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సీతక్క సూచించారు జాతర సందర్భంగా గురు, శుక్ర వారాల్లోనే ప్రతి రోజు కనీసం 40 లక్షల మంది భక్తులు ఉంటారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మేడారం జాతరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2010 నుండి ప్రతీ సంవత్సరం వస్తున్నారని, వచ్చే వందేళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలకు మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని సీతక్క గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు మాట్లాడుతూ, జాతర నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం పర్యవేక్షిస్తున్నందున అన్ని శాఖల ఉన్నతాధికారులు జాతర పనులకు సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సాధించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, మేడారం జాతరకు వివిధ శాఖలు చేస్తున్న ఏర్పాట్లు, చేపట్టిన పనులు, వాటి పురోగతి పై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా వివరించారు. ఈసారి జాతరకు దాదాపు మూడు కోట్ల మంది హాజరవుతారని అంచనా వేసినట్లు తెలిపారు. తదితర ప్రారంభానికి ముందే దదపా 30 శాతం భక్తులు సందర్శిస్తారని అన్నారు. జాతర సమయంలో 60 శాతం నుండి 65 శాతం వరకు, జాతర అనంతరం 5 శాతం భక్తులు మేదారం సందర్శిస్తారని వివరించారు. మేడారం జాతరపై ములుగు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను మంత్రులు సీతక్క, లక్షణ్ కుమార్, సీఎస్ రామకృష్ణ రావు ఆవిష్కారించారు.

జాతరకు ఆర్టీసీ ఏర్పాట్లు

మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి 3,495 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపింది. అవసరమైతే మరిన్ని బస్సులు నడిపే విధంగా కార్యాచరణ ఉంటుందని వెల్లడించింది. వీటిలో సాధారణ ఛార్జీకి 50 శాతం అదనపు మొత్తాన్ని జోడించి వసూలు చేయనున్నట్లు పేర్కొంది. ప్రత్యేక పండుగలు, జాతరలు, ఇతర ఉత్సవాల సమయంలో నడిపే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం వరకు ఛార్జీలు పెంచుకునేందుకు ఆర్టీసీకి 2003 నుంచి అనుమతి ఉంది.

ఈ బస్సుల్లో మహాలక్ష్మి పథకం

గత జాతర సమయంలో ఆర్టీసీ 3,491 ప్రత్యేక బస్సులు నడిపితే అవి కీలక సమయాల్లో కొంత వరకు సరిపోలేదు. దీంతో భక్తులు అసౌకర్యానికి గురై అసహనం వ్యక్తం చేశారు. గత పొరపాట్లను గుర్తించిన సంస్థ ఈసారి అవి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడానికి సిద్ధమయ్యింది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ప్రజల సౌకర్యార్థం నడపనుంది. ఈ బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని ఆర్టీసీ స్పష్టం చేసింది. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని పేర్కొంది. మేడారం మహాజాతర నిర్వహణలో ఆర్టీసీ మరింత కీలకం కానుంది. మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న జాతర ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ఆర్టీసీకి నిధులు కేటాయించింది. ఇప్పటికే హనుమకొండ, వరంగల్ బస్టాండ్ల నుంచి పలు సర్వీసులు కూడా ప్రారంభమయ్యాయి. గత జాతరలో 20 లక్షల మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా ఈసారి ఆ సంఖ్య 30 లక్షల మందికి చేరుకుంటుందనే అంచనాతో ప్రణాళికలు రూపొందించుకొని ముందుకెళ్తోంది.

రూ.4.35 కోట్లతో పనులు

మేడారం జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం ఆర్టీసీకి రూ.4.35 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో 15 రకాలైనటువంటి పనులను చేపడుతోంది. తాత్కాలిక బస్టాండు, బస, అలైటింగ్, బోర్డింగ్ చదును, క్యూలైన్లు, టిక్కెట్ల కౌంటర్, పార్కింగ్ స్థలాలు, క్యాంటీన్, అధికారులు, సిబ్బందికి కావాల్సిన వసతి, తాగునీరు, విశ్రాంతి గదులు, కమాండ్ కంట్రోల్ రూం, తాత్కాలిక మరుగుదొడ్లు, తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎనిమిది మందితో సిట్

మొదటిపేజీ తరువాయి

అసభ్యకరంగా రూపొందించి వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్ట్ చేసిన వ్యవహారంలో తెలంగాణ పబ్లిక్ టీవీ వాట్సాప్ గ్రూప్‌లో కావలి వెంకటేష్ అనే వ్యక్తిపై నారాయణ్‌పేట్ జిల్లా మద్దూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఇచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 11న పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా మహిళా ఐఏఎస్ అధికారినిని కించపరిచే వార్తలు టెలికాస్ట్ చేసిన వ్యవహారంలో ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి జయేష్ రంజన్ ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు నమోదు అయింది. రెండు తెలుగు న్యూస్ ఛానెల్స్ సహా ఏడు యూట్యూబ్ ఛానెళ్లపై 75, 78, 79, 351(1), 352(2) బీఎన్ఎస్ సెక్షన్లపై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల్లో దర్యాప్తునకు సిట్ ఏర్పాటైంది. సిట్‌లో సభ్యులుగా నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకటలక్ష్మి, సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రతాప్, సైబర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, సైబర్‌సెల్ ఎస్సై హరీశ్ ఉన్నారు.

రెండేళ్లలో 9,572 ఉద్యోగాలు భర్తీ చేశాం

మొదటిపేజీ తరువాయి

ఇచ్చే రిపోర్టులే డాక్టర్లకు ప్రామాణికం. వైద్య వ్యవస్థకు మీరు కళ్లు, చెవుల్లాంటి వారు. మీ రిపోర్టుల్లో కచ్చితత్వం ఎంతో ముఖ్యం. ఎన్ఏబీఎల్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ ల్యాబ్స్‌ను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ల్యాబ్ టెక్నీషియన్లు తీసుకోవాలి" అని మంత్రి పేర్కొన్నారు.

రెండేళ్లలో 9,572 ఉద్యోగాల భర్తీ

నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో 70 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని మంత్రి గుర్తుచేశారు. ఒక్క ఆరోగ్య శాఖలోనే ఇప్పటివరకు 9,572 పోస్టులను భర్తీ చేశామని, మరో 7,267 పోస్టుల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందని తెలిపారు. ఆర్థిక శాఖ అనుమతి ఉన్న మరో 996 పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని, అదనంగా 2,344 పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణను ఆరోగ్య రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి పేర్కొన్నారు. ఉస్మానియా నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, ప్రతీ జిల్లాలో ఎన్‌సీడీ క్లినిక్స్, క్యాన్సర్ డే కేర్ సెంటర్లు, ట్రాన్స్‌జెండర్ల కోసం మైత్రి క్లినిక్స్, గాంధీ ఆసుపత్రిలో ఉచిత ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తున్నామని మంత్రి వెల్లడించారు. త్వరలోనే నూతన హెల్త్ పాలసీని రూపొందించి, అమలు చేయబోతున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు సేవ చేసే అవకాశం ఉన్న ఆరోగ్యశాఖను సీఎం రేవంత్ రెడ్డి తనకు ఇచ్చారని, ఈ శాఖకు మంత్రిగా ఉన్నందుకు తనకు చాలా ఆనందంగా ఉందని మంత్రి వెల్లడించారు.

గృహజ్యోతి లబ్దిదారులకు డీసీఎం లేఖలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 13: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహ జ్యోతి - 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను చాటిచెప్పేందుకు, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు గృహ జ్యోతి లబ్ధిదారులకు వారి పేర్లతో వ్యక్తిగతంగా లేఖలు రాశారు. ఈ లేఖలను టీజీఎస్పీడీసీఎల్‌అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

పర్యాటక రంగ అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, శతాబ్దాల చరిత్ర కలిగిన పతంగుల పండుగ, మన సంస్కృతి, సంప్రదాయాల సంరక్షణ కోసం ప్రభుత్వం ఇలాంటి ఉత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా వివిధ దేశాల, రాష్ట్రాల నుండి తరలివచ్చి ఎగురవేస్తున్న రంగురంగుల పతంగులు ఆకాశాన్ని మురిపిస్తున్నాయని పేర్కొన్నారు. తన చిన్నతనంలో పతంగులు ఎగురవేసిన మధుర జ్ఞాపకాలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. గాలిపటాల తయారీని హైదరాబాద్‌లోనే పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచే ప్రయత్నం చేస్తామని మంత్రి తెలిపారు. ప్రజలు తమ బిజీ జీవితంలో కనీసం నెలకు రెండు రోజులైనా పర్యాటక ప్రదేశాలను సందర్శించాలి. దీనివల్ల మానసిక ఉల్లాసంతో పాటు, స్థానిక కళాకారులకు, వ్యాపారులకు ఆర్థికంగా చేయూత లభిస్తుందని మంత్రి పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్‌ను ప్రజలందరూ సందర్శించి విజయవంతం చేయాలని కోరుతూ, అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రాష్ట్రాల మిఠాయిల స్టాళ్లను మంత్రి జూపల్లిసందర్శించి, రుచులను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎం.డి క్రాంతి వల్లూరి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహ రెడ్డి, హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్ డి సోలంకి, క్లిక్ ప్రతినిధులు లింబీ బెంజిమన్, పరమానంద శర్మ, అభిజిత్, తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాల సమన్వయంతో పరేషన్ సిందూర్ కొనసాగుతోంది

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూడిల్లీ, జనవరి 13: పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ త్రివిధ దళాల సమన్వయానికి నిదర్శనమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. స్పష్టమైన రాజకీయ ఆదేశాలు, పూర్తి స్వేచ్ఛతోనే ఈ ఆపరేషన్ అమలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం దిల్లీలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతూనే ఉందని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో చర్యలు తీసుకోవడానికి లేదా ప్రతిస్పందించడానికి సాయుధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఉంది. భవిష్యత్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ప్రతిస్పందిస్తాయి. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది. ఈ ఆపరేషన్‌లో కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు , ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, పౌర సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే హోం మంత్రిత్వ శాఖ, రైల్వేలు తదితర శాఖలు కీలక పాత్ర పోషించాయి' అని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ప్రశంసించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం, అత్యున్నత స్థాయిలో తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలనే నిర్ణయం తీసుకున్నట్లు ఆర్మీ చీఫ్ తెలిపారు. మే 7న కేవలం 22 నిమిషాల్లో ప్రారంభమైన ఆపరేషన్, మే 10 వరకు 88 గంటల పాటు సాగిందని వివరించారు. 'ఈ ఆపరేషన్ ద్వారా ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం, లోతైన లక్ష్యాలపై దాడులు, శత్రు దేశాల అణు బెదిరింపుల ప్రచారాన్ని ఖండించడం వంటి కీలక విజయాలు సాధించాం. మొత్తం 9 లక్ష్యాల్లో ఏడింటిని భారత సైన్యం పూర్తిగా ధ్వంసం చేసింది. అనంతరం పాకిస్థాన్ నుంచి వచ్చిన చర్యలకు సమతుల్యమైన ప్రతిస్పందన ఇవ్వడంలో సైన్యం కీలక పాత్ర పోషించింది ' అని జనరల్ ద్వివేది తెలిపారు. 2025లో 31 మంది ఉగ్రవాదులను నిర్మూలించినట్లు ఉపేంద్ర ద్వివేది తెలిపారు. వారిలో 65శాతం మంది పాకిస్థాన్‌కు చెందినవారని అన్నారు. వీరిలో పహల్గాం దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులు ఆపరేషన్ మహాదేవ్‌లో చంపేసినట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సాయుధ ఘర్షణల్లో గణనీయమైన పెరుగుదల కనిపించిందని ద్వివేది పేర్కొన్నారు. సిద్ధంగా ఉన్న దేశాలే విజయం సాధిస్తాయి అనే వాస్తవాన్ని ఈ పరిస్థితులు గుర్తు చేస్తున్నాయని అన్నారు. భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ సైనిక సంసిద్ధతను ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. ఇక 'జాయింట్‌నెస్, ఆత్మనిర్భరత, ఇన్నోవేషన్' ఆధారంగా చేపట్టిన సంస్కరణ వల్ల 2025లో భారత్ సైన్యం గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. ఇక జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడుతున్నాయని చెప్పేందుకు పలు ఉదాహరణలు ఉన్నాయని జనరల్ ద్వివేది తెలిపారు. బలమైన అభివృద్ధి పనులు, పర్యాటక పునరుద్ధరణ, శాంతియుతమైన శ్రీ అమర్‌నాథ్ యాత్ర నిదర్శనాలని అన్నారు. ఈ ఏడాది యాత్రలో 4 లక్షల మందికిపైగా భక్తులు పాల్గొన్నారని, ఇది గత ఐదేళ్ల సగటు కంటే ఎక్కువ అని చెప్పారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం నుంచి పర్యాటకానికి మార్పు క్రమంగా రూపుదిద్దుకుంటోందని అన్నారు. అలాగే ఈశాన్య సరిహద్దులో పరిస్థితులు స్థిరంగానే ఉన్నాయని తెలిపారు. అయితే అప్రమత్తంగా ఉండటం కీలకమని అన్నారు. చైనా సరిహద్దులోని భారత మోహరింపులు బలంగా ఉన్నాయని చెప్పారు. అలాగే జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగా ఉన్నా, ప్రస్తుతం అవి నియంత్రణలోనే ఉన్నాయన్నారు.

రాజకీయం



రెండు న్యూస్ ఛానెల్స్, ఏడు యూట్యూబ్ ఛానెళ్లపై కేసు

- మహిళా ఐఏఎస్ ను కించపరచిన కేసు దర్యాప్తుకు సిట్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 13: తాజాగా మహిళా ఐఏఎస్ అధికారినిని కించపరిచే వార్తలు టెలికాస్ట్ చేసిన వ్యవహారంలో ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి జయేష్ రంజన్ ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు నమోదు అయింది. రెండు తెలుగు న్యూస్ ఛానెల్స్ సహా ఏడు యూట్యూబ్ ఛానెళ్లపై 75, 78, 79, 351(1), 352(2) బీఎన్ఎస్ సెక్షన్లపై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల్లో దర్యాప్తునకు సిట్ ఏర్పాటైంది. సిట్‌లో సభ్యులుగా నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకటలక్ష్మి, సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రతాప్, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, సైబర్ సెల్ ఎస్సై హరీశ్ ఉన్నారు.

అధికారిణుల పట్ల అసభ్యంగా రాయడం, కూయడం గర్హనీయం

- సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రిటైర్డ్ లోకాయుక్తా జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి



ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 13: రాజ్యాంగం హామీ ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛ అత్యంత విలువైనదని, సమాజానికి ప్రాణవాయువు లాంటిదని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రిటైర్డ్ లోకాయుక్తా (గోవా) జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. అయితే రాజ్యాంగం పరిమితుల్లేని స్వేచ్ఛకు హామీనివ్వలేదని తెలిపారు. ఇటీవల ఓ ఐఏఎస్ అధికారిణి వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించేలా ప్రసారం చేసిన కథనాలను సుదర్శన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో ఖండిరచారు. సోషల్ మీడియా అయినా సరే, ప్రధాన స్రవంతిలోని మీడియా అయినా సరే.. ప్రచార సాధనాలు ఏవైనా, బాధ్యత లేకుండా భావ ప్రకటన స్వేచ్ఛను వినియోగిస్తే నియంత్రణ కూడా అదే స్థాయిలో ప్రతిస్పందిస్తుందని, ఇది కూడా అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. స్వీయ నియంత్రణ, సమాజం పట్ల బాధ్యతగా ప్రవర్తించడం చేతగాకపోతే మీ భావ ప్రకటనా స్వేచ్ఛను మరొకరు నియంత్రించకుండా మీకు మీరే ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటే మంచిదని సూచించారు. తమ బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వహించే టువంటి యువ అధికారిణిల పట్ల అసభ్యంగా, బాధ్యతారహితంగా భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో అమర్యాదగా, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేవిధంగా రాయడం, కూయడం అత్యంత గర్హనీయమని, పురుషాధిక్యత భావజాలంతో కూడిన ప్రమాదకరమైన దుశ్చర్య అని తన ప్రకటనలో తప్పుబట్టారు.

సీఎం రేవంత్ సంక్రాంతి శుభాకాంక్షలు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 13: తెలుగు ప్రజలందరికీ సీఎం రేవంత్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలను అందించే భోగి, కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలన్నీ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి చేరాలనేది తమ సంకల్పమని ముఖ్యమంత్రి అన్నారు. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, ఉత్పత్తులు, సేవల రంగంలో తెలంగాణ రాష్ట్రం తిరుగులేని పురోగతి సాధిస్తుందనే నమ్మకం తనకుందని అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబురాలు జరుపుకోవాలన్నారు. పతంగులు ఎగరవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఉద్యోగుల కుటుంబాలు సంతోషంగా ఉండాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 13: తెలంగాణ ప్రభుత్వంలో పవర్ సెక్టార్ లో పనిచేస్తున్న ఇంజనీర్లు, ఉద్యోగులు అందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఉదయం ప్రజాభవన్ లో తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్, 1104 విద్యుత్ సంఘాల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. ప్రజల జీవితాలకు సంబంధించిన వెలుగులు అందించడమే కాకుండా ఉద్యోగుల కుటుంబాలు సంతోషంగా ఉండాలని అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్ రావు, జనరల్ సెక్రటరీ సదానందం, నాయకులు జనప్రియ వెంకటేశ్వర్లు, సాంబయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు తీపి కబురు

- రూ.277 కోట్లు విడుదల చేసిన ఆర్థిక శాఖ



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 13: సంక్రాంతి పండుగ రోజు గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలియజేస్తూ రూ. 277 కోట్ల నిధుల విడుదలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారులు సోమవారం పంచాయతీలకు రూ.277 కోట్ల నిధులను వెంటనే విడుదల చేశారు. సోమవారం ప్రజాభవన్లో ఆర్థిక శాఖ అధికారుల ముఖ్యసమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ సర్పంచ్ లకు, వార్డు మెంబర్లకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎంకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు

పంచాయతీలకు సంక్రాంతి పండుగ సందర్భంగా రూ.277 కోట్ల నిధులు విడుదల కావడం పట్ల రాష్ట్ర పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులకు ఇది ఒక గొప్ప ప్రోత్సాహకరమైన సంకేతమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి అత్యవసర అవసరాలను వేగంగా తీర్చేందుకు ఈ నిధులు ఎంతో దోహదపడతాయని తెలిపారు. గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి ఇది మరో ఉదాహరణగా నిలుస్తుందని మంత్రి సీతక్క అన్నారు. పంచాయతీలకు పెండింగ్ లేకుండా నిధులు అందేలా చొరవ చూపిన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ లు, వార్డు సభ్యులకు సంక్రాంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతవరణాన్ని పెంపొందించేందుకు కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో

'చుండూరు శేషారత్నం కవితా పురస్కారం'

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 13: తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో "చుండూరు శేషారత్నం కవితా పురస్కారం" అందించనున్నట్లు తెలుగు సాహితీ వనం నిర్వాహకులు శాంతికృష్ణ తెలిపారు. మాతృమూర్తి జ్ఞాపకార్థం అరుణనాయుడు తోట నగదు పురస్కారం అందజేయాలని సంకల్పించారని వారు తెలిపారు. కవులు 2023, 2024, 2025 సంవత్సరాల్లో వారు ప్రచురించిన కవితా సంపుటాలు రెండు కాపీలను క్రింది చిరునామాకు ఫిబ్రవరి 15 లోగా పంపించవలసిందిగా నిర్వాహకులు కోరారు. విజేతకు జూలైలో హైదరాబాద్ లో జరిగే తెలుగు సాహితీవనం వార్షికోత్సవంలో రూ 5,000 నగదుతో పురస్కార ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. విజేతలు తప్పనిసరిగా సభకు వచ్చి పురస్కారం అందుకోవాలని కోరారు. ఈ పురస్కారం నిమిత్తం పరిశీలనకు పంపిన పుస్తకాలను తిప్పి పంపడం వీలు కాదని వారు తెలిపారు. పుస్తకాలను ''అరుణనాయుడు తోట, ఎన్ సీ ఎల్ఎల్బీ గోదావరి, సీ బ్లాక్ #502, పైప్ లైన్ రోడ్, జీడిమెట్ల, హైదరాబాద్ 67 కు పంపించాలని కోరారు. వివరాలకు 6301930055 నెంబరుకు సంప్రదించాలని కోరారు.



మతాలకు అతీతంగా ముగ్గుల పోటీలు

- ముత్తంగిలో ముగ్గుల పోటీలకు హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- మహమ్మద్ ఆబేద్ ఆధ్వర్యంలో గెలిచిన వారికి బహుమతులు

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 13: ముత్తంగి డివిజన్ పరిధిలోని సాయి ప్రియ కాలనీలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని సీనియర్ నాయకులు మహమ్మద్ ఆబేద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి అత్యుత్తమ ముగ్గులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రతి ఏటా మతాలకు అతీతంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం, సామాజిక కార్యక్రమాల్లో ముందుంటున్న మహమ్మద్ ఆబేద్ ను ఎమ్మెల్యే అభినందించారు. బహుమతులు గెలుచుకున్న విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



మర్రి చెన్నారెడ్డికి నివాళులు

గాంధీ భవన్ లో తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ కేంద్ర మంత్రి, మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ డా. మర్రి చెన్నారెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ కుమార్ రావు, మాజీ పీసీసీ గిడుగు రుద్రరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తదితరులు నివాళులు అర్పించారు.

-ప్రతిపక్షం, హైదరాబాద్



టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, జనవరి 13: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్‌ని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ మంగళవారం ఆవిష్కరించారు. డైరీతో పాటు 2026 క్యాలెండర్, సంవత్సరంలో విడుదలైన అన్ని ప్రభుత్వ జీవోలతో టీపీటీఎఫ్ ప్రత్యేకంగా ముద్రించిన బుక్ ను వారికి టీపీటీఎఫ్ బాధ్యులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణతలో జిల్లా రాష్ట్రంలోనే అత్యుత్తమ స్థానంలో ఉండాలని కోరారు. అంతే కాకుండా పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో అందరం కలిసికట్టుగా పని చేద్దామని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా సమగ్ర సర్వే నిర్వహించిన సిబ్బందికి గౌరవ వేతనం రాలేదని కలెక్టర్ తెలియజేయగా, చాలా జిల్లాలకు రాలేదని, మన జిల్లాకు కూడా బడ్జెట్ అలాట్మెంట్ కాగానే సర్వే నిర్వహించిన సిబ్బంది ఖాతాలలో జమ చేస్తామని తెలియజేశారు. వివిధ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుమాల రమనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మందాడి శ్రీనివాసరెడ్డి, నూగురి దేవేందర్, జిల్లా కార్యదర్శి చకినాల రామచంద్రం, వేములవాడ మండలం అధ్యక్షులు బొజ్జ కృష్ణ, తంగళ్ళపల్లి మండల అధ్యక్షులు బండి ఉపేందర్, రూరల్ మండలం అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్ చకినాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించాలని అర్ధనగ్న ప్రదర్శన

- గౌరవెల్లి ప్రాజెక్టు కింద భూమి కోల్పోయిన రైతు ఆవేదన
- మంత్రి చెప్పినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు!



ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 13: హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు పనులలో భాగంగా భూమి కోల్పోయిన గౌరవెల్లి గ్రామానికి చెందిన రైతు నందారపు సంపత్ మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట అర్ధ నగ్న ప్రదర్శనతో నిరసన చేపట్టాడు. గౌరవెల్లి ప్రాజెక్టులో 2016లో భూమి కోల్పోయినా ఇంతవరకు నష్టపరిహారం అందించలేదని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టులో ఎకరా 10 గుంటల భూమి కోల్పోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రెవిన్యూ అధికారులు పూర్తిగా సర్వే చేసి నా తండ్రి పేరు మీద ఉన్న ఎకరం పది గుంటలు నిజమేనని తేలిన తర్వాత కూడా న్యాయం చేస్తామని చెప్పి, ఇప్పటివరకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. ఈ భూమిని ఇప్పటివరకు ఎవరికీ అమ్మకాలు గాని కొనుగోలు గాని జరపలేదని ఆయన అన్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపి బాధితునికి న్యాయం చేయాలని గతంలో కూడా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ రెవెన్యూ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని రైతు సంపత్ ఆవేదన వ్యక్తం చేస్తూ బోరున విలపించాడు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.





బతుకమ్మ కుంటలో ఎగిరిన పతంగి

- బస్తీవాసులతో వేడుకల్లో పాల్గొన్న హైడ్రా కమిషనర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 13: అంబర్‌పేటలోని బతుకమ్మకుంటలో ఎగిరిన పతంగులు ఇంద్రధనుస్సు తలపించాయి. ఒకదానితో ఒకటి పోటీ పడి నింగివైపు దూసుకెళ్లిన పతంగులను చూసి పిల్లలు కేరింతలు కొట్టారు. బతుకమ్మకుంట చెంత స్థానికులు ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పాల్గొన్నారు. పార్లమెంట్ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంత రావుతో కలసి హైడ్రా కమిషనర్ గాలిపటాలు ఎగురవేశారు. దీంతో అక్కడ పండగ వాతావరణం నెలకొంది. ఆక్రమణలు తొలగించి హైడ్రా రూపొందించిన బతుకమ్మకుంటతో ఇక్కడ వాతావరణం మారిపోయిందని చెబుతూ స్థానికులు మిఠాయిలు తినిపించుకున్నారు.

ఆకట్టుకుంటున్న బమ్-రుక్న్ - ఉద్ - దౌలా చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

పాతబస్తీలోని బమ్‌రుక్న్ ఉద్ దౌలా చెరువు సర్వాంగ సుందరంగా మారింది. తుది దశకు వచ్చిన అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం రాత్రి పరిశీలించారు. దాదాపు రెండు కిలోమీటర్లు ఉండే చెరువు గట్టుపై నడుచుకుంటూ వెళ్తూ పలు సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడి .. వారి సూచనల మేరకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. చెరువు చుట్టూ లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. చాలా స్పష్టంగా కనిపించేలా సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో వస్తున్నందున వారికి అనువైన వ్యాయామ పరికరాలను సమకూర్చాలన్నారు. చెరువు చరిత్రను చెపుతూ ప్రవేశ మార్గం వద్ద శిలాఫలకం అభివృద్ధి చేయాలన్నారు. ఔషధ గుణాలున్న నీటితో నిజాముల కాలంలో అలరారే చెరువు కనుక చెరువు చుట్టూ మెడిసినల్ ప్లాంట్స్ నాటాలన్నారు. పిల్లలు, పెద్దలు భద్రంగా.. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఎంజాయ్ చేసేలా చెరువు పరిసరాలు తీర్చి దిద్దాలన్నారు. మిగిలిన పనులను పూర్తి చేసి పండగ తర్వాత ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు.



యువకులతో క్రికెట్ ఆడిన కేంద్ర మంత్రి

ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 13: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యటించారు. కొత్త కొండ వీరభద్ర స్వామి దర్శనానికి వెళ్తున్న సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం మీర్జాపూర్ రోడ్డు మర్రి ఎక్స్‌రోడ్ సమీపంలో నిర్వహిస్తున్న యూనిటీ కప్ క్రికెట్ టోర్నమెంట్ ను గమనించిన బండి సంజయ్ వాహనాల నుంచి దిగి యువకులతో కలిసి క్రికెట్ గ్రౌండ్‌కు వెళ్లారు. యువకులు పాల్గొంటున్న టోర్నమెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. యువకుల కోరిక మేరకు కొద్దిసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఎలాంటి గొడవలకు తావులేకుండా స్నేహపూర్వకంగా క్రీడలు నిర్వహించుకోవాలని యువకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి తోట స్వరూప, ఫిలిం బోర్డు సెన్సార్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని సతీష్, మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్, పట్టణ ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ బంగ్లాదేశీయుల అంశం ప్రధాన సమస్య. వారిని గుర్తించేందుకు ఐఐటీ బాంబేతో కలిసి ఏఐ టూల్‌ను తాము అభివృద్ధి చేస్తున్నాం. ప్రస్తుతం వర్క్ కొనసాగుతోంది. ఏఐ టూల్ సక్సెస్ రేటు 60 శాతంగా ఉంది. అక్రమంగా ముంబైకి వచ్చిన బంగ్లా పౌరులను పంపించేందుకు డ్రైవ్ చేపట్టాం. మున్సిపల్ ఎన్నికల తర్వాత కూడా ఇది కొనసాగుతుంది.

- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్

ఓపెన్ వాయిస్

కుర్చీ కోసం 'మేకప్' రాజకీయం!

తెలంగాణ మున్సిపల్ రాజకీయం ఇప్పుడు ఒక రసవత్తరమైన 'కామెడీ సర్కస్'ను తలపిస్తూ, ఏ ఓటరు విజ్ఞతకు అంతుచిక్కని మాయాజాలంగా మారింది. ఎప్పుడు ఏ నేత ఏ గూటికి చేరుతాడో, ఏ జెండా నీడన ఏ స్వార్థ అజెండా అమలు చేస్తాడో తెలియక సామాన్య ఓటరు అయోమయంలో ఉన్నాడు. ఒకవైపు ఓటరు జాబితాలో అంకెల గారడీ సాగుతుంటే, పాత అవినీతికి కొత్త కండువా కప్పడం వెనుక ఉన్న వింత పోకడలు నేడు చర్చనీయాంశమయ్యాయి. చట్టబద్ధమైన నిధులు వ్యక్తిగత ఆస్తులుగా మారుతున్న క్రమంలో, బల్దియా పోరు నైతిక విలువలకు, రాజకీయ బేరసారాలకు మధ్య యుద్ధంగా మారింది. సిద్ధాంతాలను తుంగలో తొక్కి, కేవలం గెలుపు గుర్రాల వేటలో పడిన పార్టీల వైఖరి మున్సిపల్ ముఖచిత్రాన్ని పూర్తిగా కలుషితం చేస్తోంది. పథకాల అమలులో పారదర్శకత లోపించడం, కౌన్సిలర్ల పెత్తనం మితిమీరడం వంటి అంశాలు ప్రజాస్వామ్య వ్యవస్థలోని లోపాలను స్పష్టంగా ఎత్తి చూపుతున్నాయి.

ఖద్దరు కండువా చాటున దాగుడుమూతలు

తెలంగాణ వ్యాప్తంగా నిన్నటి వరకు కారులో షికారు చేసి, అధికారాన్ని అడ్డం పెట్టుకుని అందినకాడికి



ఫిరోజ్ ఖాన్
9640466464

దోచుకున్న నేతలకు ఇప్పుడు హస్తం కండువా ఒక రక్షణ కవచంలా కనిపిస్తోంది. పాత పార్టీలో చేసిన పాపాలను కడుక్కోవడానికి, విచారణల నుంచి తప్పించుకోవడానికి వలస నేతలు తెల్లవారుజామునే తీర్థం పుచ్చుకుంటున్నారు. అవినీతి ముఖానికి పార్టీ కండువాతో పక్కా మేకప్ వేసుకుని, తాము అమాయకులమని జనం ముందు ఫోజులు ఇవ్వడం చూస్తుంటే నవ్వు ఆపుకోవడం ఎవరి తరమూ కాదు. ఈ 'వాషింగ్ మెషీన్' రాజకీయం వల్ల నిబద్ధత గల సిద్ధాంత వాదులు మూలన పడటం నిజంగా ఒక రాజకీయ విషాదం. ఇలాంటి వలస పక్షుల వల్ల పార్టీ ప్రతిష్ట గంగలో కలిసే ప్రమాదం ఉందని విశ్లేషకులు గట్టిగా హెచ్చరిస్తున్నారు.

నిధుల సమాధి మీద తాజ్ మహల్‌లు

రాష్ట్రంలోని పలు వార్డుల్లో జరిగిన అభివృద్ధి పనులను చూస్తే అది మున్సిపల్ నిధుల సమాధి మీద కట్టిన తాజ్ మహల్‌లా కనిపిస్తుంది. వేయని రోడ్లకు బిల్లులు డ్రా చేయడం, పాత డ్రైనేజీలకే కొత్త రంగులు వేసి నిధులు స్వాహా చేయడం ఇక్కడ నిరంతరం సాగే ఒక కళాఖండం. కాగితాల మీద రోడ్లు జెట్ వేగంతో పరిగెడుతుంటే, నేల మీద మాత్రం సామాన్య ప్రజలు గుంతల్లో పడి విన్యాసాలు చేస్తున్నారు. నోటీసులు ఇచ్చినా, విచారణలు జరిగినా నేతల జేబులు నిండటం మాత్రం గంటల వ్యవధిలోనే జరిగిపోవడం ఒక వింత. ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకుని మేడలు కట్టిన నేతలు, ఇప్పుడు మళ్ళీ అదే ప్రాంతాల్లో ఓట్లు అడగడానికి రాజకీయా మేకప్ వేసుకుంటున్నారు. గాలిలో రోడ్లు వేసి, జేబుల్లో బిల్లులు వేసుకోవడంలో వీరు ఆస్కార్ స్థాయిని మించిన గొప్ప నటులని చెప్పక తప్పదు.

కౌన్సిలర్ గారి 'అల్లావుద్దీన్ దీపం'

ఐదేళ్లలో కోట్ల బంగ్లా ఎలా? కొందరు కౌన్సిలర్ల దగ్గర 'అల్లావుద్దీన్ అద్భుత దీపం' ఉందేమో అన్న అనుమానం కలగడం సహజం, ఎందుకంటే వారి ఆస్తుల పెరుగుదల అలా ఉంది. ఐదేళ్ల క్రితం సామాన్య ఇళ్ళలో ఉన్న నేతలు, పదవిలోకి రాగానే కోట్ల రూపాయల బంగ్లాలు ఎలా నిర్మించారో సామాన్యులకు అది ఒక సైన్స్ ఫిక్షన్. మున్సిపల్ కాంట్రాక్టులు, పైరవీలు, అక్రమ వసూళ్లే ఈ అద్భుత దీపానికి ఆయిల్ లా పనిచేస్తున్నాయన్నది పట్టణమంతా తెలిసిన బహిరంగ రహస్యం. ప్రజలకు సేవ చేయాల్సిన పదవిని వ్యాపారంగా మార్చుకుని, బల్దియా ఖజానాను పద్ధతిగా లూటీ చేస్తున్న వైనం స్పష్టంగా కనిపిస్తోంది. వీరి ఆస్తుల మీద సమగ్రమైన విచారణ జరిపిస్తే, మున్సిపాలిటీలో జరిగిన అసలైన కుంభకోణాలన్నీ ఒక్కొక్కటిగా బయటపడి ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తాయి.

పాత పార్టీ సొమ్ము.. కొత్త పార్టీ ప్రచారం

వలస నేతల మాయాజాలం భలే విచిత్రంగా ఉంటుంది. పాత పార్టీలో ఉన్నప్పుడు దోచిన సొమ్మును ఇప్పుడు కొత్త పార్టీలో టికెట్ల కోసం ఖర్చు పెడుతున్నారు. దోచింది అక్కడ.. ఖర్చు పెడుతోంది ఇక్కడ అన్నట్టుగా సాగుతున్న వీరి రాజకీయం చూసి జనం పగలబడి నవ్వుకుంటున్నారు. పార్టీ మారినా బుద్ధులు మారవని, మళ్ళీ గెలిస్తే అంతకు పది రెట్లు దోచుకుంటారని ప్రజలకు ఇప్పటికే పక్కాగా అర్థమైపోయింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు కోటి ముప్పై లక్షల మంది మున్సిపల్ ఓటర్లను బురిడీ కొట్టించడానికి నేతలు వేస్తున్న ఎత్తుగడలు చూస్తుంటే ఒక పొలిటికల్ సర్కస్ లా ఉంది. వీరి అనుభవం అంతా నిధులను ఎలా దారి మళ్లించాలనే దానిపైనే ఉండటంతో, నికార్సైన కార్యకర్తలు ఇప్పుడు నివ్వెరపోతున్నారు. నైతికతను వదిలేసి కేవలం ధనబలం మీద ఆధారపడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టిన అసలైన గ్రహణం అని చెప్పవచ్చు.

బల్దియాలో బాహుబలి

తెలంగాణ వ్యాప్తంగా 140కి పైగా మున్సిపాలిటీల్లో ఇప్పుడు అసలైన బాహుబలి సినిమాను మించిన డ్రామా కళ్లముందు కదలాడుతోంది, ఇందులో పాత్రలన్నీ విచిత్రమే. రాజకీయ యుద్ధంలో వెన్నుపోటు పొడిచే కట్టప్పలు ఎవరో, ప్రజల పక్షాన నిలిచే అమరేంద్ర బాహుబలి ఎవరో ఓటర్లే నిర్ణయించాల్సి ఉంటుంది. పథకాల పేరుతో పేదలను బెదిరించి ఓట్లు దండుకోవాలని చూస్తున్న కౌన్సిలర్లకు ఈసారి ప్రజలు చుక్కలు చూపించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వేను ఆసరాగా చేసుకుని బ్లాక్ మెయిల్ చేసే నేతలు ఇప్పుడు ప్రజల ఆగ్రహానికి బెంబేలెత్తుతున్నారు. రాష్ట్రంలోని మహిళా ఓటర్లు రాజకీయ నాటకాన్ని అత్యంత నిశితంగా గమనిస్తూ తీర్పుకు సిద్ధమవుతున్నారు.

(వ్యాసకర్త ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

ఫజుల్ జీవితం ఒక పజిల్ లాంటిది



శేషం సుప్రసన్నాచార్యులు
900024596

ఒక జర్నలిస్టు
ఒక కవి
ఒక నటుడు
ఒక అనౌన్సర్
ఒక ఉపన్యాసకుడు
ఒక హిందీ టీచర్
ఒక ప్రిన్సిపల్
ఒక స్కూల్ యజమాని
ఒక మోటివేటర్
ఒక బస్ కండక్టర్
ఒక బస్ చెకింగ్ అధికారి
ఒక సామాజికవేత్త
ఇవన్నీ కలగలిపితే
ఒక ఫజుల్ రహమాన్
ఔను నాకూ ఫజుల్ కూ ఉన్న
అనుబంధం ఈనాటిది కాదు
అది అనన్యసామాన్యం
అనితరసాధ్యం

మా స్నేహానికి అంకురార్పణ

హుస్నాబాద్ పెద్దబడిముందు ఖాజామియా హోటల్ ఉండేది ఉపాధ్యాయులందరూ స్కూల్ ముగిసినతరువాత హోటల్ ముందు కొంతసమయం గడిపేవారు కొందరు టీ తాగితే కొందరు కాలక్షేపం కోసం గుమికూడేవారు మా నాన్నగారు తెలుగు ఉపాధ్యాయునిగా హుస్నాబాద్ స్కూల్లో దాదాపు ఇరవై సంవత్సరాలకుపైగా పనిచేశారు. ఫజుల్ తమ్ముడు జుల్ఫీతో నాకు మంచి స్నేహముండేది ఆ కారణంగా ఆ హోటల్ తో నాకూ అనుబంధమేర్పడింది. 197879 ప్రాంతంలో సినిమాడైరెక్టర్ అనే నాటకం ప్రదర్శించాము అందులో నాది సంగీతబ్రహ్మపాత్ర దాని రిహార్సల్స్ కు రోజూ రాత్రి కలిసేవాళ్ళం ఆ నాటకప్రదర్శనే మా స్నేహానికి నాందీపలికింది. మా విద్యాభ్యాసం అనేక ఒడిదొడుకులతో సాగింది 1984లో నేనూ ఫజుల్ శ్రీ తిరుమలయ్యగారి నెహ్రూమెమోరియల్ స్కూల్లో టీచర్లు గా చేరాము అప్పటినుంచి ఇంకాబలమైన మైత్రి మా మధ్య చోటుచేసుకుంది. నేను 1975నుండే కవిత్వం రాయడం ఆ కవితలు ఆకాశవాణి హైదరాబాదులో ప్రసారంకావడం వలన బడిపిల్లలచేత రేడియో ప్రోగ్రామ్స్ ఇప్పించేవాడిని. దానికోసం ప్రాక్టీస్ చేయించడంలో మా ఇద్దరిపాత్ర చాలా ఉండేది. అలా పిల్లలచేత చాలా రేడియో ప్రోగ్రాములు ఇప్పించేవారం 1985లో నేను రాసిన పాటలు రాగఝరి పేరుతో చిన్నపుస్తకంగా ప్రచురించిన ఆ చిన్నిపుస్తకం రేడియో అక్కయ్యగా పేరుపొందిన తురగా జానకీరాణిగారికి అంకితంఇచ్చే కార్యక్రమం హుస్నాబాద్ పెద్దబడిలో నిర్వహిస్తే ఫజుల్ విధుమౌళిలాంటిమిత్రులు చాలామంది నావెన్నంటి ఉండి జయప్రదంచేశారు.

హుస్నాబాద్ పబ్లిక్ స్కూల్ తో ఇంకాబలిష్ఠమైన మా స్నేహం

1987-88 ప్రాంతంలో హుస్నాబాద్ పబ్లిక్ స్కూల్ పేరుతో ఉన్నతపాఠశాల స్థాపించారు. నేను కవిని, తెలుగుపండితుని కొడుకును కాబట్టి నన్ను తెలుగు టీచర్ గా చేర్చుకున్నాడు. తెలుగు బోధనతో పాటు స్కూల్ పరిపాలనా బాధ్యత కూడా కొంతవరకు చూసుకొమ్మనేవాడు. ఫజుల్ ప్రిన్సిపల్ కదా! అని మీరు అని సంబోధిస్తే అదేమిటి కొత్తగా ఈ మర్యాదలు ఇప్పుడెందుకు? పొరపాటున కూడా అలా సంబోధించవద్దని చెపుతూ నన్ను మా ఇంట్లో నాన్నగారు పిలిచినట్టే ప్రసన్న అని పిలిచి ఆత్మీయతకు అద్దంపట్టేవాడు.

స్పష్టమైన తెలుగు ఉచ్చారణ

నేడే చూడండి మీ అభిమాన థియేటర్..... దగ్గరనుండి వేలమందిముందు ఇచ్చే ఉపన్యాసం వరకు తెలుగులో స్పష్టంగా మాట్లాడేవాడు. తెలుగు ఉపాధ్యాయుడినైన నేనే ఆశ్చర్యపోయేవాడిని సినిమా చాటింపులోనైనా, చర్చలోనైనా, పిచ్చాపాటీ మాట్లాడడంలోనైనా ఎక్కడైనా స్పష్టంగా సమయస్ఫూర్తితో మాట్లాడేవాడు. ఫజుల్ తెలుగు న్యూస్ చానల్ రంగానికివస్తే ఇప్పుడు ప్రముఖచానల్స్ లో ఉన్న హేమీహేమీలైన వారితో సమానస్థాయిలో ఉంటారనడం అతిశయోక్తి కాదు. నేను రెండుమూడు సార్లు చెప్పిన కానీ పరిస్థితులప్రభావమో ఏమో కాని టీవీ రంగానికి రాలేకపోయాడు.

జర్నలిస్టుగా

1984 ప్రాంతంలో ఆంధ్రప్రభ విలేఖరిగా చేరి జర్నలిస్టుగా బాగా రాణించాడు. ప్రారంభంలో సముద్రాలలో ఒకవ్యక్తి లింగమార్పిడి ఆపరేషన్ చేయించుకొని వస్తే మేమందరం చూడడానికిపోయాము అదే ఫజుల్ వార్త రాసి ఆంధ్రప్రభకు పంపిస్తే తెల్లవారి ఆంధ్రప్రభ ఫ్రంట్ పేజీలో అమ్మాయైన అబ్బాయి అని వస్తే ఫజుల్ తోపాటు మేమందరం పొందిన సంతోషానికి అవధులు లేవు. దిమొదలుగా ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, దిశ, ముద్ర పేర్లలో పనిచేసి తానే సంపాదకుడిగా'ప్రతిపక్షం' పేపర్ ను నిరాఘాటంగా నడిపిస్తూ జర్నలిస్టుగా తనపేరును పదిలపరచుకున్నాడు.

సినిమాలంటే చాలాఇష్టం

మా ఇద్దరికీ సినిమాలంటే చాలా ఇష్టం. ఫజుల్ ఒక అడుగుముందుకువేసి మా ఊరిలోని సినిమాటాకీస్ యజమానులతో సత్సంబంధాలు కలిగియుండేవాడు. నేడే చూడండి మీ అభిమాన థియేటర్..... అని కొత్తసినిమాల చాటింపుకూడా చేసేవాడు యన్. టి. ఆర్ డైలాగ్స్ అంటే ఫజుల్ చెవికోసుకునేవాడు బొబ్బిలిపులి సినిమా రిలీజైన రోజు ఫజుల్ నేను ఇంట్లో చెప్పకుండా హన్మకొండకువెళ్ళి సినిమాచూశాము. దాదాపు హుస్నాబాద్ కు వచ్చిన ఏసినిమా కూడా వదిలిపెట్టేవారిమికాదు విధుమౌళి శోభన్ బాబు అభిమాని ఫజుల్ యన్టీయార్ అభిమానిగా ఉంటూ అందరిసిన్మాలు ఇష్టంగా చూసేవారం

ఆటంకాలను అధిగమించి

మా అబ్బాయి ఒకటిరెండుసార్లు ఫజుల్ నుచూసి, మాట్లాడే విధానం ఆ స్పష్టత చూసి ఇటీవలే నాన్నా! ఒకసారి అంకుల్ ను చూసివద్దామంటే ఎండాకాలం సెలవుల్లో వెళ్దాం అన్నాను కానీ ఇంతలోనే ఈ దుర్వార్త వినడం జీర్ణించుకోలేక పోతున్నాం. ఆ రోజుల్లో కడుపు నిండా తిండిలేకున్నా కంటినిండా నిద్రలేకున్నా జీవితంతో ఏనాడూ రాజీపడలేదు. ఆర్థిక ఇబ్బందులున్నా, సామాజికంగా ఒడిదొడుకులు ఎదురైనా జీవితమనే చదరంగంయొక్క పావులు కదుపుతూవచ్చాడు ఫజుల్. కాని విధిబలీయమైనది నా లాంటి మిత్రబృందానికి ఫజుల్ ను దూరం చేయడానికి క్యాన్సర్ అనే పావును వాడుకొని విధి మా అనుంగు మిత్రుడిని మాకు దూరంచేసింది. అనేక ఎత్తుపల్లాలను ఎదుర్కొంటూ జీవితమనే యుద్ధనౌకను దాటించిన ఫజుల్ రహమాన్ జీవితం నిజంగా ఒక పజిల్ లాంటిదని చెప్పవచ్చు.

వ్యాసకర్త విశ్రాంత ఉపాధ్యాయులు



సినిమా డైరెక్టర్ నాటకంలో...



నేను హుస్నాబాద్ పబ్లిక్ స్కూల్ వదిలి వెళ్ళినప్పుడు..



ఇటీవల సంవత్సరం క్రితం హుస్నాబాద్ లో కలిసినప్పుడు

ప్రజల ప్రశ్నలే 'ప్రతిపక్షం'గా అక్షర యజ్ఞం



మన్నారం నాగరాజు
9550844433

ప్రజాస్వామ్యం అనేది కేవలం ఓటు వేసే హక్కుతో ముగిసిపోయే వ్యవస్థ కాదు. అది నిరంతరం ప్రశ్నలు అడిగే చైతన్య ప్రక్రియ. అధికారాన్ని నిలదీసే ధైర్యం, అన్యాయాన్ని బయటపెట్టే స్వేచ్ఛ, అణచివేతకు ఎదురు నిలిచే సామాజిక బాధ్యత,ఈ మూడింటి సమ్మేళనమే నిజమైన ప్రజాస్వామ్యం. ఈ నేపథ్యంలో "ప్రతిపక్షం" అనే భావనను కేవలం ఎన్నికల్లో ఓడిపోయిన రాజకీయ పార్టీలతో పరిమితం చేయడం ఒక మేధో మోసం. ప్రజాస్వామ్యంలో అసలైన ప్రతిపక్షం పార్లమెంట్లలో అసెంబ్లీలో మాత్రమే కాదు, అది ప్రజల మనసుల్లో ఉంటుంది, వారి గుండెల్లో మగ్గుతున్న ప్రశ్నల్లో ఉంటుంది, వారి జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలపై 'ఎందుకు?' అని అడిగే ధైర్యంలో ఉంటుంది. అటువంటి ప్రజల ప్రతిపక్షానికి అక్షర రూపం ఇచ్చిన అరుదైన యోధుడు ఫజల్ రహమాన్. ఫజల్ రహమాన్‌ను కేవలం ఒక జర్నలిస్టుగా, ఒక సంపాదకుడిగా చూడడం ఆయన చేసిన పోరాటానికి అన్యాయం చేయడమే. ఆయన ఒక వ్యక్తి కాదు,ఒక వ్యవస్థ. ఒక పత్రిక కాదు, ఒక ఉద్యమం. ఒక పేరు కాదు, ఒక సామాజిక న్యాయ స్వరం. అధికారానికి ఎదురుగా నిలబడి ప్రజల పక్షాన ప్రశ్నలు సంధించిన నిజమైన ప్రతిపక్ష స్వరం ఆయన. ఏదో ఒక రాజకీయ పార్టీకి చెందకుండానే ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్రను ఎలా పోషించవచ్చో తన జీవితంతో చూపించిన అక్షర యోధుడు. జర్నలిజం అనేది క్రమంగా కార్పొరేట్ ప్రయోజనాలకు, రాజకీయ దళారీతనానికి, కుల-మత ఆధిపత్యాలకు లోబడి పోతున్న కాలంలో ఫజల్ రహమాన్ జర్నలిజం ఒక తిరుగుబాటు. అధికారానికి దగ్గరగా ఉండడమే జర్నలిజం అన్న భ్రమకు విరుద్ధంగా, ప్రజలకు దగ్గరగా ఉండడమే జర్నలిజం అని ఆయన నమ్మారు. ఆ నమ్మకమే "ప్రతిపక్షం" దినపత్రికగా రూపుదిద్దుకుంది. "ప్రతిపక్షం" ఒక సాధారణ దినపత్రిక కాదు. అది ఒక అక్షర ఉద్యమం. అది పాలకుల విజయాలను పొగడటానికి పుట్టలేదు. అధికారుల ప్రకటనలను యథాతథంగా ముద్రించడానికి పుట్టలేదు. ప్రజల కన్నీళ్లను సిరాగా చేసుకుని, వారి ఆవేదనను ప్రశ్నలుగా మలచి, వారి నిరాశను నిరసనగా మార్చడానికి పుట్టింది. అందుకే ఆ పత్రికను చదవడం అంటే వార్తలు తెలుసుకోవడం మాత్రమే కాదు ,ఆలోచించడం, ఆవేశపడడం, ప్రశ్నించడం. భూసమస్యలు, కూలీల కష్టాలు, నిరుద్యోగం, దళితులు, బీసీలు, గిరిజనులు, మైనారిటీలపై జరుగుతున్న దమనకాండ, మహిళలపై కొనసాగుతున్న వివక్ష, ప్రభుత్వాల ద్వంద్వ వైఖరి,ఈ అంశాలన్నింటినీ ఫజల్ రహమాన్ తన పత్రిక ద్వారా నిరంతరం ప్రజల ముందుకు తీసుకొచ్చారు. అధి



కారంలో ఎవరు ఉన్నారన్నది ఆయనకు ముఖ్యం కాదు. వారు చేసిన అన్యాయం ముఖ్యము. పాలకుల రాజకీయ రంగు కాదు, ప్రజల జీవితాలపై పడుతున్న ప్రభావమే ఆయన జర్నలిజానికి కొలమానం.ఈ రోజుల్లో అధికారాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, దేశద్రోహం ముద్ర వేయడం, ప్రజాస్వామ్య విలువలను ప్రశ్నిస్తే వ్యవస్థ వ్యతిరేకి అనడం, కుల-మత ఆధిపత్యాలను నిలదీస్తే సామాజిక శత్రువుగా చిత్రీకరించడం సాధారణమైపోయింది. కానీ ఫజల్ రహమాన్ తన కలంతో ఒక సత్యాన్ని నిరూపించారు.అధికారాన్ని ప్రశ్నించడం ద్రోహం కాదు,అది పౌరుల హక్కు. ప్రశ్నలే ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు. ప్రశ్నలు ఆగిపోయిన రోజే ప్రజాస్వామ్యం శవంగా మారుతుంది. 1980లో ఆంధ్రప్రభ దినపత్రికలో జర్నలిస్టుగా తన ప్రజా అక్షర ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనతి కాలంలోనే ప్రజా సమస్యలతో పాటు జర్నలిస్టుల సమస్యలను కూడా అక్షరీకరించి వెలుగులోకి తీసుకొచ్చారు. ప్రజాతంత్ర, జీవగడ్డ, ఆంధ్రజ్యోతి, దిశ, ముద్ర వంటి అనేక దినపత్రికల్లో నాలుగున్నర దశాబ్దాలకు పైగా పనిచేసిన అనుభవం ఆయన జర్నలిజానికి పదును పెట్టింది. కానీ ఆ అనుభవం ఆయనను వ్యవస్థలో కలిపివేయలేదు. వ్యవస్థను ప్రశ్నించే స్థాయికి తీసుకెళ్లింది. అదే క్రమంలో ఆయన స్వంతంగా "ప్రతిపక్షం" దినపత్రికను ప్రారంభించారు. అది ఒక వ్యాపార నిర్ణయం కాదు, ఒక రాజకీయ-సామాజిక సవాల్. సాంప్రదాయ భావజాల పత్రికలకు భిన్నంగా "ప్రతిపక్షం" పీడిత వర్గాల పక్షాన నిలిచింది. తెలంగాణలో సుమారు 85 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల హక్కుల అణచివేతపై నిరంతరం ప్రశ్నలు వేసింది. డబ్బు, అధికారంతో రాజకీయాలను నియంత్రించే ఆధిపత్య కుల వ్యవస్థను ఆయన కలం భయపడకుండా నిలదీసింది. అందుకే ప్రతిపక్షం దినపత్రిక ప్రజలకు ఆశగా నిలిచింది. ఫజల్ రహమాన్ జర్నలిజం కేవలం వార్తల ప్రసారం కాదు, అది చైతన్య ప్రసారం. అట్టడుగు అణగారిన వర్గాల కోసం పోరాడిన అనేకమంది అజ్ఞాత మహనీయుల కథలను ఆయన పత్రిక ప్రజల ముందుకు తీసుకొచ్చింది. సామాజిక న్యాయ పోరాటాలకు వేదికగా నిలిచింది. ఈ క్రమంలో నేను రాసిన అనేక వ్యాసాలను, విశ్లేషణలను ప్రోత్సహించారు. సూచనలు ఇచ్చారు. విమర్శలను స్వీకరించారు. చర్చలకు తావిచ్చారు. ఇక జర్నలిజాన్ని ఒక వృత్తిగా మాత్రమే కాకుండా, ఒక సామాజిక బాధ్యతగా చూసిన వ్యక్తి ఫజల్ రహమాన్. అందుకే ఆయన విద్యను కూడా సామాజిక మార్పుకు ఒక సాధనంగా భావించారు. ఇక జర్నలిజమే తుదిశ్వాసగా జీవించిన ఈ అక్షర యోధుడు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతూ ఈ నెల 9న కన్నుమూయడం పత్రికా రంగానికి తీరని లోటు. ఇది కేవలం ఒక వ్యక్తి మరణం కాదు. ప్రజల పక్షాన నిలిచిన ఒక ధైర్యవంతమైన స్వరం మూగబోయిన క్షణం. ఫజల్ రహమాన్ మరణంతో పత్రికా రంగం ఒక గొప్ప సంపాదకుడిని మాత్రమే కాదు, ఒక నైతిక ప్రమాణాన్ని కోల్పోయింది.ఈ రోజుల్లో ప్రజల పక్షాన నిలిచే జర్నలిజం ఎక్కడ ఉంది? అధికారాన్ని భయపడకుండా ప్రశ్నించేకలం ఎంతమంది చేతుల్లో ఉంది?..అక్షరాలను ఆయుధాలుగా మలచుకుని పోరాడిన ఫజల్ రహమాన్ ఇక లేరు. కానీ ఆయన ప్రశ్నలు ఇంకా మోగుతూనే ఉన్నాయి. అవి మనందరినీ ప్రశ్నిస్తున్నాయి. ప్రజల పక్షాన నిలబడటం అంటే ఏమిటి? జర్నలిజం అంటే ఏమిటి? ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం పాత్ర ఏమిటి? ఫజల్ రహమాన్‌కు నివాళి అంటే కేవలం సంతాప సభలు కాదు. ఆయన చూపిన దారిని కొనసాగించడమే నిజమైన నివాళి. ప్రజల పక్షాన నిలబడే జర్నలిజాన్ని కాపాడుకోవడమే ఆయనకు అర్పించే శ్రద్ధాంజలి. ఆయన అక్షరాలు ఆగిపోయాయి గానీ, ఆయన పోరాటం ఆగకూడదు. అదే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.

సామాజిక రాజకీయ విశ్లేషకులు

అద్ ధర్మ ఉద్యమ పితామహుడు మంగురాం చమార్



సంపతి రమేష్ మహారాజ్
7989579428

పంజాబ్‌లో దళిత పోరాట ప్రవక్తగా అభివర్ణించే వ్యక్తి బాబు మంగురాం. ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త, అద్ ధర్మ ఉద్యమ స్థాపకుడు, దళితుల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన నాయకుడు. బ్రిటిష్ పాలనలో కుల అణచివేతకు గురైన వర్గాలకు స్వాభిమానం, హక్కులు, సమానత్వం కావాలనే లక్ష్యంతో ఉద్యమించారు. ఆది ధర్మ్ ఉద్యమం ద్వారా దళితుల్లో ఆత్మగౌరవాన్ని నింపి, సామాజిక చైతన్యాన్ని పెంచారు. మంగురాం 1886 జనవరి 14 పంజాబ్‌లోని ముగోవాల్ గ్రామానికి చెందిన దళిత నాయకుడు, చమార్ కులానికి చెందినవారు. ఆమెరికాలో గదర్ పార్టీ ఉద్యమంలో పాల్గొని, దేశానికి తిరిగి వచ్చి దళితుల సామాజిక, రాజకీయ చైతన్యం కోసం కృషి చేశారు. అమెరికాలోని గదర్ విప్లవకారులతో సన్నిహితంగా ఉండి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడడానికి సంకల్పించాడు. బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా కూడా పోరాడారు. భారతదేశంలో అగ్రకుల హిందువుల' ఆధిపత్యంలో దళితులు విస్మరించబడ్డారు. అంటరానితనం, అస్పృశ్యతతో వెలివేయబడ్డారు. బాబు మంగు రామ్ ముగోవాలియా అమెరికా ఉదారవాద ఆలోచనలు ఆయనను కుల వ్యవస్థలో సామాజిక వివక్షకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసేలా చేసింది. ఈ క్రమంలో ఆయన 1920లలో పంజాబ్‌లో అద్ ధర్మ్ మండల్ స్థాపించి, దళితులను "మూల నివాసులు"గా గుర్తించి, వారికి ప్రత్యేక మతం (అద్ ధర్మ్) పేరు సూచించారు. అద్ ధర్మ్ ఉద్యమం దళితుల సాంస్కృతిక పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక పునరుద్ధరణ, రాజకీయ చైతన్యంపై దృష్టి సారించింది. దళితులను "మూల నివాసులు"గా ప్రకటించి, కుల వివక్ష, అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాడారు. భూమినీటిఆలయ హక్కుల కోసం గ్రామ సమావేశాలు నిర్వహించారు. "అద్ ధర్మ నాయకులు సనాతన హిందూ మతంలో దళితులను అపవిత్రులుగా చూడటాన్ని ఖండించారు. ఈ మతం నుంచి వేరు చేసి, వారి స్వంత పురాతన మతం అద్ ధర్మ్‌లో ఏకీకృతం చేయడం లక్ష్యంగా ఉద్యమాన్ని నడిపారు. తద్వారా గౌరవం, స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించారు. దళితులు ఈ భూమికి నిజమైన నివాసులనీ చేసిన వాదన అంటరానివారిపై అపారమైన మానసిక ప్రభావాన్ని చూపింది. బహుజనులను దేశ రాజకీయ పటంలోకి తీసుకువచ్చిన దళిత ఐకాన్ మాన్యవర్ కాన్షీ రామ్, హోషియార్‌పూర్‌లో తన బహిరంగ ప్రసంగాలలో అద్‌ధర్మ ఉద్యమం గురించి వివరించి మంగురాం ఆలోచనను ముందుకు తీసుకువెళ్లాడు. ఆద్ ధర్మ ఉద్యమం ఆనాటి సనాతన హిందూ మతానికి వ్యతిరేకంగా సాగిన తిరుగుబాటు ఉద్యమం. 1931 జనాభా లెక్కల్లో అద్ ధర్మ కు ప్రత్యేక మతంగా రాయాలని డిమాండ్ చేశారు. 4.5 లక్షల మంది దళితులను దాని కింద నమోదు చేయించారు.



బహుజన రాజకీయ చైతన్యానికి పునాది

అన్యాయానికి ఎదురొడ్డి నిలబడాలంటే ధైర్యం, ఐక్యత, అవగాహన అవసర అని చెప్పి హక్కుల కోసం శాంతియుతంగా పోరాడాలని చెప్పిన మంగురాం మంగోలివాలియా జీవితం మనకు గొప్ప పాఠం. నేడు తప్పుడు చరిత్రల వల్ల ఉద్ధం సింగ్, ఝల్కారీ బాయి వంటి ఎస్సీ, ఎస్టీ, బీసీల పరాక్రమం, ఉద్యమాన్ని చరిత్ర పుస్తకాల్లో లిఖించలేదు. అదే నెహ్రూను కాశ్మీర్ బ్రాహ్మణుడిగా, గాంధీని గుజరాత్ వైశ్యగా స్వాతంత్ర చరిత్రలో గొప్పగా పరిచయం చేసి ఆధిపత్య అగ్రకులాలు చైతన్యమయ్యారు. కానీ, మంగురాం, ఉద్ధం సింగ్ వంటి దళితుల చరిత్రపై వివక్షత చూపారు. కావున చరిత్రకందని ఇలాంటి దళిత, బహుజనుల త్యాగాలు, అస్తిత్వ పోరాటాలు మనకు తెలియకపోవడంతో వారినుంచి ప్రేరణ పొందలేకపోయాం. ఈ క్రమంలో మాన్యవార్ మంగు రామ్ చమార్ వీరత్వాన్ని బహుజన రాజ్యాధికార ఉద్యమంలో పరిచయం చేశాడు. బహుజనుల్లో ఇలాంటి అరుదైన పోరాట వీరుల చరిత్రను వెలికితీసి ప్రేరణ పొంది విముక్తి వైపు ప్రయాణించాలి.

జనవరి 14 మంగురాం జయంతి

వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

రాష్ట్ర ప్రభుత్వం పండుగలను మరిచింది..

- మంజుల రాజనర్సు



ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 13:
ముగ్గుల పోటీలు పూర్వ వైభవాన్ని తలపించాయని మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రాజనర్సు అన్నారు.సిద్దిపేట పట్టణ 3వ వార్డు రంగాధంపల్లిలో వార్డు కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రాజనర్సు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఆరు సంవత్సరాల చిన్నారి వేసిన ముగ్గుకు ముగ్ధులై ప్రత్యేక బహుమతి అందజేశారు. అదేవిధంగా 2వ వార్డు నర్సాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు గరిపల్లి విజయ్ కుమార్,జోయ్ అలుక్కాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను పరిశీలించి ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఏడాది సిద్దిపేటలో సంక్రాంతి పండుగ సందడి అధికంగా ఉందని, ఎక్కువ మంది మహిళలు చుక్కల ముగ్గులు వేయడం ఆనందంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పండుగల నిర్వహణలో వెనుకబడిందని విమర్శించారు. సిద్దిపేట ప్రజలను కంటికి రెప్పలా చూసుకునే నాయకుడు హరీశ్ రావు అని పేర్కొన్నారు. నర్సాపూర్ అభివృద్ధికి 1.50 కోట్ల నిధులతో హైమాస్ లైట్లు, సీసీ రోడ్లు, విశ్వబ్రాహ్మణ సంఘ భవనం పనులు పూర్తయ్యాయని తెలిపారు. పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. నర్సాపూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలో హైమాస్ లైట్లు, బాల వికాస మంచినీటి శుద్ధి కేంద్రం ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, మాజీ కౌన్సిలర్లు ఐలయ్య, బండారి నర్సింలు, బీఆర్ఎస్ నాయకులు కనకయ్య, వడ్లకొండ శ్రీనివాస్, దబ్బేట శ్రీనివాస్, పరికి భాను చందర్, కోర ఎల్లయ్య, రమేష్ యాదవ్, కర్రోళ్ల సతీష్, రాజిరెడ్డి, ఎర్రబోలు రాజిరెడ్డి, జోయ్ అలుక్కాస్ మేనేజర్ లిగేష్ తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి పర్వం తెలుగు జాతికి గర్వం..

రుస్తుం, సుప్రసిద్ధ చిత్రకారులు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 13:
సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో మంగళవారం మకర సంక్రాంతి చిత్రాలను ప్రముఖ అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం,లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా అందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పండుగలు సంస్కృతి సంప్రదాయాల నిలయాలు సమాజాలను కళావంతం చేస్తాయని సంక్రాంతి ఎవరి హక్కులు వారికి, సక్రమంగా సంక్రమించె నవ్యక్రాంతి మకర సంక్రాంతి అన్నారు. ఈ పండుగకు ఆడపడుచులు అనాదిగా వేస్తున్న రంగు రంగుల ముగ్గులతో, హరిదాసు సంకీర్తనలతో, రుచికర పిండివంటలతో, కొత్త అల్లుళ్ళ మురిపాలతో, పతంగుల కేరింతలతో, జాతర్లలో సంప్రదాయం ఉట్టిపడే ఎడ్లబండి ముస్తాబులతో దూడు బసవన్నల విన్యాసాలతో, సాయంత్రాలు కవిసమ్మేళనాలతో తెలంగాణ సంస్కృతి కలర్ఫుల్ గా తెలుగుజాతి జీవితాల్లో సంతోషాలు వెల్లివిరుస్తాయని,ఆనందడోలికల్లో మునిగి తేలుతాయన్నారు. నిరుద్యోగాన్ని అధిగమించి ప్రపంచ నలుమూలల ఐక్యత, శాంతి సామరస్యతను పెంపొందించాలని మానవతా చిత్రకారులు రుస్తుం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఏ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీంరుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబీనారుస్తుం మహమ్మద్ సాధిక్, ఎండి రహీం, తదితరులు పాల్గొని అందరికి మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి వివేక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 13:
సిద్దిపేట పట్టణంలో అభివృద్ధి పనులు శంకుస్థాపనకు వచ్చిన రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ ను మంగళవారం సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ అత్తు ఇమామ్ ను ఆప్యాయంగా పలకరించారు. త్వరలోనే పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని వార్డు నాయకులతో సమావేశం నిర్వహించాలి అని అత్తు ఇమామ్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో గయాజుద్దీన్ హర్షద్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- తిమ్మా పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



ప్రతి పక్షం సిద్దిపేట బ్యూరో, జనవరి13:
దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామం లోగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ డిప్యూటేషన్ లో వెళ్ళినట్లు సిబ్బంది తెలపగా వెంటనే డిప్యూటెషన్ రద్దు చేసి రేపు పి ఎచ్ సి వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్ఎచ్ఓ నీ ఫోన్ ద్వారా ఆదేశించారు. అటెండెన్స్, ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. లీవ్ లెటర్ లు చెక్ చేస్తూ మీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే పై అధికారి అనుమతి లేనిదే సెలవు తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పి హెచ్ సి కి వచ్చిన రోగులకు ఓపికగా మెరుగని వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు.

కురుమ యువ చైతన్య సమితి క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రతిపక్షం చేర్యాల, జనవరి 13:
కురుమ యువ చైతన్య సమితి (కేవైసీఎస్) 2026 నూతన సంవత్సరం క్యాలెండర్ ను చేర్యాల మండల కేంద్రంలోని బీరప్ప దేవాలయం వద్ద మంగళవారం కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా కేవైసీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీస సత్యానారాయణ, కేవైసీఎస్ మండల అధ్యక్షుడు అందె అశోక్ మాట్లాడుతూ.. రాష్టంలో అత్యధికంగా ఓటు బ్యాంకు కలిగిన కురుమలు రాజకీయంగా, ఆర్థికంగా,సామాజికంగా ఎదగాలని సూచించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య,కోనపురి సాంబశివుడు, బెల్లి లలితక్క, చుక్క సత్తయ్య ల పోరాట యోధుల స్ఫూర్తితో యువత చతన్యవంతమై కురుమలు రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రాజకీయ రిజర్వేషన్లు ప్రకటించాలని, దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని, 2వ విడత గొర్రెల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ శెట్టె కొమురయ్య, మండల అధ్యక్షుడు శెవల్ల రాజయ్య, మాజీ కౌన్సిలర్ చెవిటి లింగం, కొమురవేల్లి మండల అధ్యక్షుడు అత్కూరి జయరాములు, ఏఎంసీ డైరెక్టర్ బండారి కనకయ్య, బండారి అంజయ్య, నంగి కనకయ్య, గౌండ్ల శ్రీనివాస్, బండారి సిద్ధులు, బండారి శ్రీశైలం, ఎగుర్ల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

- ప్రమాదస్థలిలో యువకుడు మృతి, మరో యువకునికి గాయాలు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 13:
రోడ్డుపై ఆగిఉన్న టిప్పర్ను వెనుక నుంచి వచ్చిన ఓ ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న యువకుడు మృతి చెందగా, వెనుక కూర్చున్న మరో యువకునికి తీవ్ర గాయాలైన సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారు రాజీవ్ రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ (ఎర్రపల్లి)కి చెందిన బద్రు ఎల్లయ్యకు పిల్లలు లేకపోవడంతో తన చెల్లెలైన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ గ్రామానికి చెందిన తోకల పద్మసత్యనారాయణ దంపతుల కొడుకు మధుయాదవన్ను చిన్నప్పటి నుంచి సాకుతున్నాడు. ఆర్మూర్ లో పద్మ ఇంటి సమీపంలో ఉండే మరో యువకుడు ఏనుగు గంగారెడ్డి(25), మధుయాదవ్ లు ఇద్దరు స్నేహితులు. గంగారెడ్డి తూప్రాన్లో నివాసముంటూ వర్గల్ మండలం నాచారంలోని ఓ సీడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మధు యాదవ్ చెందిన వ్యవసాయభూమి మల్లన్నసాగర్ ప్రాజెక్టు సమీపంలో ఉండడంతో అక్కడికి గంగారెడ్డితో కలిసి వెళ్ళి తిరిగి ఆర్అండ్ఆర్ కాలనీలోని ఎర్రవల్లికి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారులో హరితారెస్టారెంట్ సమీపంలో రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న టిప్పర్ను వెనుక నుంచి వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనాన్ని నడిపిస్తున్న గంగారెడ్డి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న వ్యక్తిని సైతం గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు మధు యాదవ్ మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.





యాసంగిలో రైతులకు యూరియా ఇబ్బందులు కలగవద్దు

- కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం మిడిదొడ్డి జనవరి 13
యాసంగి సీజన్ లో రైతులకు యూరియా పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందిలు లేకుండా అన్నిఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రైతులకు తెలిపారు.మీరుదొడ్డి మండల కేంద్రంలోని ఎస్ హకా సర్వీస్ సెంటర్ 2 లో యూరియా పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులతో మాట్లాడారు. ఎలాంటి కొరత ఇబ్బందులు లేవని యూరియా వెంటనే ఇస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రైతులకు యాసంగి సీజన్ లో ఎక్కడ కూడా యూరియా కొరత రాకుండా పగడ్బందిగా ప్రణాళిక ప్రకారం అన్ని సెంటర్ లలో యూరియా బస్తాలను రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం. మీ ప్రాంతాల్లోని వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని మీ యొక్క పాసు బుక్ తీసుకుని వచ్చి యూరియా కార్డులను తీసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఒక ఎకరాకు 2 బస్తాల చొప్పున యూరియా పంపిణీ చెయ్యాలని వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపారు. కౌలు రైతులు సైతం అధైర్యపడవద్దని మీరు చేస్తున వ్యవసాయ క్షేత్ర పట్టేదర్ పాస్ బుక్ లేదా జిరాక్స్ తీసుకువస్తే యూరియా అందిస్తామని తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



ప్రతిపక్షం మిడిదొడ్డి జనవరి 13
మీరుదొడ్డి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. సందర్భంగా ఆమెఅటెండెన్స్ రిజిస్టర్ ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ . . ఆసుపత్రిలో వైద్యం ఎలా ఉందని అడగ్గా బాగానే ఉందని మంచిగా చూస్తున్నారని తెలిపారు. వృద్ధులు బలవర్ధకమైన ఆహారం రాగి జావా, మిల్లెట్స్ తీసుకోవాలని తెలిపారు. యునాని వైద్య సేవల గూర్చి ఆరా తియ్యగా వృద్ధులకు యునాని వైద్యం వైపు మళ్లించాలని యునాని సెలవులను విస్తృతంగా ప్రచారం చెయ్యాలని యునానీ డాక్టర్ ను ఆదేశించారు. ఈ మధ్యకాలం లో చిన్న పిల్లలకు పలు వ్యాధుల బారిన పడితే వ్యాయామం మరియు యోగా క్రమం తప్పకుండా ధ్యానం, ప్రాణాయామం నేర్పించాలని యోగ ఉపాధ్యాయులకు తెలిపారు.మీరుదొడ్డి మండలంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. తహసిల్దార్ అత్యవసర పనికై ఆర్డీఓ కార్యాలయం కి వెళ్ళారని సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేశారు. కార్యాలయ సిబ్బంది సమయ వేళలు పాటించాలని ఆదేశించారు. భూ భారతి పెండింగ్ అప్లికేషన్స్ డిస్పోజల్ ప్రక్రియ మరియు ఎలక్ట్రోరల్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చెయ్యాలని ఆదేశించారు.



యువత వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల్లో రాణించాలి

ప్రతిపక్షం మిడిదొడ్డి జనవరి 13
యువత వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల్లో రాణించాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో నిర్వహించిన డిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ను ఆర్గనైజర్ యాదగిరితో కలిసి ఆయన ప్రారంభించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ధర్మారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్లో యువత తమ నైపుణ్యాన్ని చాటాలన్నారు. ప్రతిభ కనబరిచి గెలుపొందిన టీంకు 10116, రన్నర్ గా నిలిచిన టీంకు 5116 నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు స్నేహ భావంతో క్రీడలో పాల్గొనాలని సూచించారు. గత రెండు సంవత్సరాలుగా ధర్మారం గ్రామంలోక్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న రంగనమైన యాదగిరిని అభినందించారు. క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటుతో యువకులంతా పటాన్ నుండి గ్రామానికి తిరిగి రావడంతో పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ బాలరాజు, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక సరఫరాలో టోకెన్ పద్ధతిని ఎత్తివేయాలి

- యధావిధిగా పాత పద్ధతిలోనే ఇసుక అందించాలి
- ఆకునూరు బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



ప్రతిపక్షం చేర్యాల, జనవరి 13:
చేర్యాల మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో పెద్ద వాగు నుండి గ్రామ ప్రజలు వినియోగించుకునే ఇసుక కు పెట్టిన టోకెన్ పద్ధతి ఆంక్షలు ఎత్తివేసి పాత పద్ధతిలోనే కొనసాగించాలని బీఆర్ఎస్ ఆకునూరు గ్రామ నాయకులు శనిగరం లక్ష్మణ్, జంగిటి భిక్షపతి, మల్లమారి నవీన్ కుమార్,ముచ్చాల వంశీ డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. గత బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి ఆంక్షలు లేకుండా సరఫరా కొనసాగించామని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టోకెన్ పద్ధతిని పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గ్రామ పరిధిలో ఉన్న గృహ నిర్మాణాలు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు, ఇతర ప్రజల అవసరాల కోసం వినియోగించుకునే ఇసుకకు ఎన్నడూ లేని విధంగా ఆంక్షలు పెట్టి లబ్ధిదారులను గ్రామ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యపై అధికార పార్టీ నాయకులు, అధికారులు తక్షణమే స్పందించి టోకెన్ పద్ధతిని రద్దుచేసి యధావిధిగా పాత పద్ధతిలోనే ఇసుక రవాణా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇటీవల జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.



నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ వరం

ప్రతిపక్షం,తొగుట, జనవరి 13:
ఆపదలో ఉన్నవారికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అండగా నిలుస్తున్నారని మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో మండలంలోని వెంకట్రావుపేట కు చెందిన ఎర్రోళ్ల చంద్రం, కామొల్ల నరేష్, మిద్దె మహేశ్వరి లకు సీఎం ఆర్ ఏఫ్ ద్వారా రూ. 50వేల చెక్కులను సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ తో కలిసి ఆయన అందించారు. కార్యక్రమం లో ఉప సర్పంచ్ లచోళ్ల లింగం, వార్డు సభ్యులు పిట్ల వెంకటేష్, జహంగీర్, నాయకులు పిట్ల వెంకటయ్య, సిరిసిల్ల లింగం, పాత్కుల బాలేష్, స్వామి, ఆంజనేయులు తదితరులున్నారు...



తల్లిదండ్రులు సంపాదించిన అవినీతి డబ్బును పిల్లలు తిరస్కరించాలి. 'తమ తల్లిదండ్రులు ఆదాయానికి మించి సంపాదించిన దేన్నైనా పిల్లలు తీసుకోకూడదు. వాటికి లబ్ధిదారులుగా ఉండొద్దు. ఇది దేశానికి చేసిన గొప్ప సేవ అవుతుంది' అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏకు చట్టబద్ధతపై దాఖలైన పిల్ విచారణ జరుగుతోంది.

- జస్టిస్ BV నాగరత్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ప్రాంతీయం



కలెక్టరేట్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 13:

టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అన్ని శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ మధుమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో మొదటి బహుమతి శాంభవి, శాంతి విద్యా శాఖ, ద్వితీయ బహుమతినీ రోజా రాణి రవళి రెవెన్యూ శాఖ, గౌతమి అరుణ మత్స్యశాఖ గెలుచుకోవడం జరిగినది. అదేవిధంగా తృతీయ బహుమతిని ప్రియాంక పద్మ ఆడిట్, చీఫ్ ప్లానింగ్ శాఖ పొందడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉద్యోగుల ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతి ఇవ్వడం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని, అదేవిధంగా మహిళా ఉద్యోగులు అన్ని రంగాల్లో ముందు ఉండి జిల్లా కార్యాలయాల్లో వారి పనులను సంతృప్తికరంగా నిర్వహించుకుని జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని కోరడం జరిగినది. మహిళా ఉద్యోగులకు అభినందించి జిల్లా ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ మాట్లాడుతూ టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించడం ఒక మంచి సాంప్రదాయమని మరియు ముగ్గుల పోటీలలో పాల్గొన్నటువంటి ఉద్యోగులకు అదేవిధంగా జిల్లా ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి ముల్క నాగరాజు, కోశాధికారి ఎం దేవరాజు, ఉపాధ్యక్షులు రాజ్యలక్ష్మి ఎంసీ పోచయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్, కల్చరల్ సెక్రటరీ రాజ్ కుమార్, ఈసీ నెంబర్లు సాయినాథ్, లక్ష్మణ్ మరియు దత్తాద్రి, అర్బన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి మరియు సృజన్, జిల్లా క్లాస్ ఫోర్ సంగం కార్యదర్శి మక్బూల్, కార్యవర్గ సభ్యులు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయము మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణ మాఫీకి కృషి

- దుబ్బాక మున్సిపల్ లో కాంగ్రెస్ జెండా ఎగరాలి
- దుబ్బాకకు మరిన్ని నిధుల మంజూరు
- దుబ్బాకపై ముత్యం రెడ్డి చెరగని ముద్ర
- త్వరలోనే మరిన్ని పెన్షన్లు
- మంత్రి వివేక్ వెంకటస్వామి



ప్రతి పక్షం సిద్దిపేట బ్యూరో, జనవరి 13:

కాంగ్రెస్ సర్కార్ రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని, రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేసిందని, రాష్ట్రంలో అక్కడక్కడ కొంత మంది రైతులకు రుణ మాఫీ కాలేదన్న విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రుణ మాఫీ అయ్యేటట్లు చూస్తానని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. మంగళవారం దుబ్బాకలో జరిగిన దుబ్బాక, తొగుట, మిరుదొడ్డి, దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ పాలక వర్గాల ప్రమాణస్వీకారోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దుబ్బాక నియోజక వర్గానికి మొదటి సారి వచ్చినప్పుడు మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డిని గుర్తు చేసుకున్నానని తెలిపారు. మా తండ్రి వెంకట స్వామి, ముత్యం రెడ్డి మంచి మిత్రులన్నారు. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలపర్చేవిధంగా అందరూ పనిచేయాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదని, విబేధాలు లేకుండా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులు 55 పైగా గెలిచారని, హరీష్ రావు, కేటీఆర్, కెసిఆర్ లకు 100ల ఎకరాలలో ఫామ్ హౌస్ లు కట్టుకొని సంతోషంగా ఉన్నారన్నారని, ప్రజలను మాత్రం దుఃఖంలోకి నెట్టారన్నారు. తొందర్లోనే కొత్త పెన్షన్లు జారీ చేస్తామని ప్రకటించారు. రూ. 13 వేల కోట్ల వ్యయంతో సన్నబియ్యం ప్రతినెల ఇస్తున్నామని, రెండు లక్షల రూపాయల రుణమాఫీ రైతులకు అర్హులైన వారికి రుణమాఫీ చేసామన్నారు. దుబ్బాక మున్సిపాలిటీకి రూ. 15 కోట్లు మంజూరు చేశామని, దుబ్బాక మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. దుబ్బాక నియోజకవర్గానికి మరిన్ని నిధులు కేటాయించేలా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు నిరాశ పడోద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దుబ్బాక ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ఎల్లవేళల అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి స్థలాలను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 13 :

అన్ని హంగులతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహ సముదాయాల నిర్మాణాల కోసం ఎంపిక చేసిన స్థలాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. ఆర్మూర్ శివారులోని పిప్రి రోడ్డులో గల స్థలంతో పాటు, అంకాపూర్ శివారులోని స్థలాన్ని స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, అనుకూల వాతావరణం, రవాణా సదుపాయం, విద్యార్థులకు ఏ మేరకు భద్రత ఉంటుంది, నేల స్వభావం తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. సమగ్ర సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అధునాతన వసతి, సదుపాయాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అన్ని అధునాతన సౌకర్యాలతో వసతిని కల్పిస్తూ, ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో అందరికీ ఆదర్శంగా నిలిచేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని అన్నారు. ఇప్పటికే మంజూరీలు తెలుపబడిన ఆయా నియోజకవర్గాలలో వీటి నిర్మాణాలు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగం సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.



నేత్రపర్వంగా గోదాదేవి-రంగనాథస్వామి కళ్యాణ మహోత్సవం

ప్రతిపక్షం,తొగుట, జనవరి 13:

మండలంలోని వెంకట్రావుపేటలోని శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో మంగళవారం నిర్వహించిన గోదాదేవిరంగనాథస్వామిల కళ్యాణ మహోత్సవం భక్త జనుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాయారావు అరుణరఘుపతిరావు నేతృత్వంలో నిర్వహించిన కళ్యాణమహోత్సవంలో ఆలయ అర్చకులు రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. భోగి పండుగ సమయంలో నిర్వహించే గోదాదేవిరంగనాథస్వామిల కళ్యాణం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది.. కళ్యాణోత్సవంలో భాగంగా విశ్వక్ సేవ, ఆరాధన, పుణ్యవచనం, గోదాదేవిరంగనాథస్వామిల కళ్యాణం, స్వామి వారి ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి గ్రామ సర్పంచ్ బండారు కవిత స్వామిగౌడ్ పట్టు బట్టలు అందించారు....



జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రతిపక్షం బ్యూరో,నిజామాబాద్, జనవరి 13 :

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. భోగభాగ్యాలనిచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి వేడుక ప్రజలందరికీ ఆనందం పంచాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో శుభాలు సమకూరాలని, అనుకున్న కార్యాలన్నీ నెరవేరాలని, ఏడాది పొడుగునా ఇంటింటా సిరుల కాంతులు విలసిల్లాలని అభిలషించారు.

రైతుల అవసరాలకు సరిపడా అందుబాటులో ఎరువులు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ఎరువుల గిడ్డంగి ఆకస్మికంగా తనిఖీ
- డ్రోన్ ద్వారా నానో యూరియా వినియోగం ప్రయోగాత్మక పరిశీలన



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 13 :

జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల విషయంలో ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి భరోసా కల్పించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. గిడ్డంగిలో అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్, ఈ పాస్ యంత్రం ద్వారా ఎరువుల అమ్మకాల వివరాలు పరిశీలించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులను కలెక్టర్ పలకరించి, సరిపడా ఎరువులు అందుతున్నాయా అని ఆరా తీశారు. యాసంగి సీజన్ కు సంబంధించి జిల్లాలో పూర్తి స్థాయిలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, కోరిన మేరకు ఎరువుల స్టాక్ ను జిల్లాకు పంపుతున్నారని, ప్రస్తుత యాసంగిలోనే కాకుండా వచ్చే ఖరీఫ్ సీజన్ కు సైతం ఎరువుల కొరత ఉండబోదని కలెక్టర్ రైతులకు సూచించారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, సహకార సంఘాలు లేని చోట రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేసేలా, పంట సాగు చేస్తున్న ప్రతి రైతుకు ఎరువులు అందేలా చూస్తామని స్పష్టం చేశారు. అయితే రైతులు ఒకేసారి ఎరువులను కొనుగోలు చేసి అట్టిపెట్టుకోకుండా, తమ అవసరాలకు అనుగుణంగా దశల వారీగా ఎరువులు తీసుకోవాలని హితవు పలికారు. మోతాదుకు మించి ఎరువులు వాడవద్దని హితవు పలికారు. నానో యూరియా వాడకంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో ఓ ఆదర్శ రైతు పంట పొలంలో డ్రోన్ ను వినియోగిస్తూ నానో యూరియా ఎరువును పిచికారీ చేస్తున్న విధానాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులతో కలిసి ప్రయోగాత్మకంగా పరిశీలించారు. నానో యూరియా వినియోగంపై ఆసక్తి కలిగిన రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్, జిల్లా వ్యవసాయ అధికారి వీరాస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రావు, మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, స్థానిక అధికారులు ఉన్నారు.



సంక్రాంతి లీగ్ వన్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్

- రాయికోడ్ గ్రామ యూత్ ఆధ్వర్యంలో

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ జిల్లా జనవరి 13

రాయికోడ్ గ్రామం యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా రాయికోడ్ లో (ఆర్ ఎస్ ఎల్ 1) రాయికోడ్ సంక్రాంతి లీగ్ వన్, ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంటును ఆ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, రుబ్బేన కట్ చేయగా, గ్రామ పెద్దలు టాస్ వేసి, క్రికెట్ ను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి. శశికల రవి కుమార్, ఉప సర్పంచ్ మ్యాతారి గోపాల్, పుల్లరి ఆనంద్, పంచాయతీ కార్యదర్శి రమేష్, స్వామి, ఆంజనేయులు గౌడ్, మల్లేష్ యాదవ్, కాజా, మనుసుర్, పత్తి రవి, మొగిలాప్ప, సత్యరెడ్డు, తయాప్ప గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జబ్బర్, పి. ఆనంద్, విజయ్, కాజామైనోదిన్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులు సమన్వయంతో మున్సిపల్ ఎన్నికల పనులు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ జిల్లా జనవరి 13

అధికారులు సమన్వయంతో మున్సిపల్ ఎన్నికల పనులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మక్తల్ మున్సిపాలిటీని మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికలకు ఇప్పటివరకు కొనసాగిన వివిధ రకాల పనులను మున్సిపల్ కమిషనర్ను అడిగి మున్సిపల్ ఎన్నికల పనులు తెలుసుకున్నారు. త్వరలో జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో నిర్వాహణ పనులు ఎలాంటి అవకతవకులు జరగకుండా పగడ్గబందిగా నిర్వహించేందుకు మక్తల్ తాసిల్దార్ సతీష్ కుమార్. ఎంపీడీవో రమేష్ మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు ముగ్గురు అధికారులు ఎన్నికల పనులను సమర్థవంతంగా సమన్వయంతో కలిసి పని చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులతో అన్నారు. బ్యాలెట్ పేపర్ తొ మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నందున బ్యాలెట్ బాక్స్ లను సిద్ధంగా ఉంచుకోవాలని ఇటీవల సర్పంచ్ ఎన్నికలు నిర్వహించిన పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ ఎంపీడీవో దగ్గర పోలింగ్ బాక్సులు ఉన్నాయని వాటిని మున్సిపల్ కమిషనర్ సేకరించి పెట్టుకోవాలని. మక్తల్ లో ఉన్న 16 వార్డుల కు సంబంధించిన ఓటర్ లిస్ట్ ను మున్సిపాలిటీలో ఉన్న ఓటర్లు పోలింగ్ స్టేషన్ ల పరిస్థితి 38 పోలింగ్ స్టేషన్స్ 4 రూట్స్ ,వార్డ్స్ 16 ,మొత్తం ఓటర్స్ 23,345. పోలింగ్ అధికారులు అవసరం ఉంటుంది ఒక్క పోలింగ్ లో ఎంత మంది ఓటర్స్ ఉన్నారు.బ్యాలెట్ బాక్స్ ల అవసరం పై మున్సిపల్ కమిషనర్ ద్వారా తెలుసుకున్నారు. బ్యాలెట్ బాక్స్ ల భద్ర పరిచే విషయం లో జాగ్రత్తలు పాటించాలని జూనియర్ కళాశాల ప్రాంగణం లోనే ఓ ప్రత్యేక గది లో భద్రపరచడం జరుగుతుందని కమిషనర్ కలెక్టర్ గారికి తెలిపారు. కౌంటింగ్ కేంద్రం కూడా కళాశాల లో ఉంటుందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పోలింగ్ సామాగ్రి ని కళాశాల మైదానం లోనే పోలింగ్ అధికారులకు పంపిణి చేయడం జరుగుతోందన్నారు. నోటిఫికేషన్ పేపర్లను పోటీ చేసే అభ్యర్థులకు ఇవ్వడానికి సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులతో కలెక్టర్ సిక్తాపట్నాయక్ చర్చించారు. ఈ సమావేశం లో మక్తల్ మున్సిపల్ కమిషనర్, మక్తల్ తహసీల్దార్, మక్తల్ ఎంపీడీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి నెలాఖరు కల్లా భవిత కేంద్రాలన్నీ అందుబాటులోకి రావాలి

- అర్హత కల్గిన ప్రతి విద్యార్థికి ఉపకార వేతనం అందేలా చొరవ చూపాలి
- పెండింగ్ లో ఉన్న సివిల్ వర్క్స్ ను వెంటనే పూర్తి చేయించాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 13 :

ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఉద్దేశించిన భవిత సెంటర్ ల నిర్మాణాలు, మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయించాలని, ఫిబ్రవరి నెలాఖరు నాటికి జిల్లాలోని మొత్తం 29 కేంద్రాలు అందుబాటులోకి వచ్చేలా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం మండల ప్రత్యేక అధికారులు, ఎం.ఈ.లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలు, భవిత కేంద్రాలు, కస్తుర్బాగాంధి విద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను కలెక్టర్ సమీక్షిస్తూ, అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాగా, ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలు పొందేందుకు అర్హత కలిగిన ప్రతి విద్యార్థి లబ్ది పొందేలా వారి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయించాలని కలెక్టర్ సూచించారు. పేద కుటుంబాలకు చెందిన డే స్కాలర్ విద్యార్థులకు ఉపకార వేతనం ఎంతో కొంత ఆర్థిక తోడ్పాటును అందిస్తుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అర్హులైన ప్రతి ఒక్కరితో ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేయించాలని సూచించారు. అవసరమైన వారికి జనన ధృవీకరణ, కుల, ఆదాయ పత్రాలు వెంటదివెంట మంజూరు చేసేలా తహసిల్దార్లను ఆదేశిస్తామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు. భవిత కేంద్రాలతో పాటు కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, వైద్యరోగ్య కేంద్రాలు తదితర వాటిని క్రమం తప్పకుండా సందర్శిస్తూ పనితీరును పరిశీలించాలన్నారు. విద్యా సంస్థలలో బోధన, బోధనేతర సిబ్బంది అందుబాటులో ఉంటూ సమర్ధవంతంగా పని చేయాలన్నారు. మండల అధికారులతో సమన్వయాన్ని పెంపొందించుకుని ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు పక్కాగా జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అన్ని కేజీబీవీలు, ప్రభుత్వ హాస్టళ్ళు, పాఠశాలల్లో తప్పనిసరిగా టాయిలెట్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అన్నది పరిశీలించాలన్నారు. ముఖ గుర్తింపు విధానం ద్వారా హాజరు ప్రక్రియను కొనసాగిస్తున్నారా అన్నది గమనించాలన్నారు. ఎవరైనా విద్యార్థి ఎక్కువ రోజులుగా గైర్హాజర్ అవుతున్నట్లు గమనిస్తే, అందుకు గల కారణాలను తెలుసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తెచ్చి పరిష్కారానికి చొరవ చుపాలన్నారు. మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేపడుతున్న సివిల్ వర్క్స్ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, డీ.ఈ.ఓ అశోక్, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎం.ఈ.ఓలు పాల్గొన్నారు.

“



ఇటీవల రూపాయి పడిపోతుండటం.. డాలర్‌తో పోలిస్తే రూపీ వాల్యూ రూ.90ని దాటడం సాధారణ హెచ్చుతగ్గుల్లో భాగమే. రూపాయి, మారకపు రేట్లపై ఆర్‌బీఐ విధానం ఏళ్లుగా స్థిరంగా ఉంది. మార్కెట్లు బలంగా ఉన్నాయని మేం నమ్ముతున్నాం. ధరలను అవే నిర్ణయిస్తాయి. భారత ఎకానమీ మూలాలు బలంగా ఉన్నాయి.

- ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

ప్రాంతీయం

అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి వాకిటి



ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ జిల్లా జనవరి 13

మక్తల్ పట్టణం మున్సిపల్ పరిధి లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. ఉదయాన్నే వార్డు లను సందర్శించిన మంత్రి నిర్మాణ దశలో ఉన్న పనులను పర్యవేక్షించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఉన్న కాలనీల్లో మంత్రి పర్యటించి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వారికి వివరించారు. పట్టణంలోని 1,11, 14 వ వార్డ్ లలో 2కోట్ల 50 లక్షల తో చేపట్టిన డ్రైనేజీ, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 26 ఏళ్ళ వయస్సులో మక్తల్ సర్పంచ్ గా ఎన్నికయ్యానని, ఎంపీటీసీ గా,జడ్పీటీసీ గా, ఎమ్మెల్యే గా, మంత్రి గా అయ్యానంటే అది మక్తల్ ప్రజల దయతోనే అన్నారు.పీఏసి లో మేబెర్ గా గొప్ప అవకాశం రావడం, ఖమ్మం జిల్లాకి ఇంచార్జి మంత్రి గా ఉండడం కూడా నియోజకవర్గ ప్రజల చొరవ తోనే అని తెలిపారు. మక్తల్ నియోజకవర్గాన్ని 15 మంది ఎమ్మెల్యేలు 72 సంవత్సరాలనుండి పాలించినా కూడా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక నేను మంత్రి ని అయిన కొన్ని రోజుల వ్యవధి లోనే 1035 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.. తెలంగాణ రాష్ట్రం లో వేగంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గాల్లో మక్తల్ ఒకటని తెలిపారు. రాజకీయాలకతీతంగా అందరం కలిసి మక్తల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం దశాబ్ది ఉత్సవాలు



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 13 :

వచ్చే నెలా 1న జిల్లా కేంద్రం లోని న్యాల్కల్ రోడ్డు ఆర్ఎన్ కన్వెన్షన్ హాల్లో(న్యాలకల్ రోడ్) విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం (వేవా)దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని 125 దంపతులచే విశ్వకర్మ పరమాత్మ యజ్ఞ మహోత్సవాన్ని ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రతిభా పురస్కారాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వేవా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవాపురం గోపాలకృష్ణాచార్య తెలిపారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా అయోధ్య బాల రాముని విగ్రహ రూపశిల్పి అరుణ్ యోగిరాజ్ రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం తో పాటు 2025 లో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర పరీక్షల్లో పాసైన , ఐఐటి, నీట్ , లా సెట్, ఎడ్సెట్ ఇతర ఎంట్రన్స్ ఎగ్జామ్ లలో సీట్లు సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు అదేవిధంగా విశ్వబ్రాహ్మణులై ఉండి నూతనంగా ప్రభుత్వ ఉద్యోగులు పొందిన పదోన్నతులు పొందిన జిల్లా రాష్ట్ర జాతీయస్థాయిలో ప్రభుత్వ పురస్కారాలు అందుకున్న వారు ఆయా రంగాల్లో రాణిస్తున్న విశ్వబ్రాహ్మణ ప్రముఖులకు ప్రొఫెసర్ జయశంకర్ సార్ పురస్కారాలు ప్రధానం చేస్తారని వెల్లడించారు. దీని కొరకు ఈ నెలా జనవరి 25 లోపు 9052552664 నెంబర్ కు వాట్సాప్ ద్వారా తమ మేమో, ఆధార్ కార్డ్ ఫోటోలు, వ్యక్తిగత వివరాలు పంపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్, జిల్లా కోశాధికారి కే శ్రీధర్, గౌరవ అధ్యక్షులు మనోహరా చారి, రామచందర్, డివిజన్ అధ్యక్షుడు గణేష్ ఆచార్య, ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాస్, కోశాధికారి కాళిదాస్ లు పాల్గొన్నారు.



కూరగాయల వ్యాపారి దుర్మరణం

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 13

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ప్రధాన రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.హనుమకొండ వైపు వెళ్తున్న ట్రక్కును, కరీంనగర్ నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు.మృతుడు పెద్దల శ్రీనివాస్ (48). ఆయన హసన్‌పర్తి మండల కేంద్రంలో కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. నిత్యం హనుమకొండ నుంచి హసన్‌పర్తికి కూరగాయల ట్రక్కు నడుపుతూ ఉపాధి పొందుతున్నట్లు సమాచారం. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హనుమకొండకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటనతో హసన్‌పర్తి మండలంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



పలుఅభివృద్ధి కార్యక్రమాలకు శంఖు స్థాపన చేసిన మంత్రి వివేక్

ప్రతిపక్షం సిద్ధిపేట బ్యూరో జనవరి 13:

దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన 15 కోట్ల రూపాయల నిధులతో దుబ్బాక మున్సిపాలిటీలో పలు వార్డులలో నిర్మించ తలపెట్టిన మురికి కాల్వలు, కల్వర్టు, సి సి రోడ్ల అభివృద్ధి నిర్మాణా పనులకు మంగళవారం రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి , ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి శంఖుస్థాపన చేశారు.అనంతరం దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపల పల్లి గ్రామాల్లో 2కోట్ల 23 లక్షలతో నిర్మించనున్న వంతెనకు శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ కె. హైమావతి, ఎంఎల్ ఏ కొత్త ప్రభాకర్ రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ కే. లింగమూర్తి, ఆర్డీఓ సదానందం ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధికి అందరం కృషి చేద్దాం

- మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు అవిశిపేట ఆంజనేయులు గౌడ్.
- మొయినాబాద్ మండల ఉపసర్పంచ్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక.

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 13:

గ్రామాలను అన్ని రంగాలలోసర్పంచులతోకలిసి అభివృద్ధి చేసుకుందామని మండల ఉప సర్పంచ్ల సంఘం నూతన అధ్యక్షుడు అవిశిపేట ఆంజనేయులు గౌడ్ ఉపాధ్యక్షుడు తూర్పు జితేందర్ రెడ్డిలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి సమీపంలో మొయినాబాద్ మండల ఉపసర్పంచ్ ల నూతన కార్యవర్గ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షునిగా చిన్నమంగళారం ఆంజనేయులు గౌడ్ ఉపాధ్యక్షునిగా అందాపురం జితేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా రవీందర్ కార్యదర్శులుగా కేతిరెడ్డిపల్లి శ్రీనివాస్ కోశాధికారిగా శ్రీరామ్ నగర్ మెయిన్ రెడ్డి కార్యవర్గ సభ్యులుగా అవినాష్ యాదవ్ రాజు సలహాదారులుగా నక్కలపల్లి నిరంజన్ గౌడ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు, జితేందర్ రెడ్డిలు మాట్లాడుతూ.. గ్రామాలలో సర్పంచులు పంచాయతీ కార్యవర్గంతో కలిసి గ్రామ అభివృద్ధికి అందరం కృషి చేద్దామని పేర్కొన్నారు . పార్టీలకు అతీతంగా అందరూ కలిసి పని చేసినప్పుడే గ్రామాలు ఆదర్శ గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపసర్పంచులు వార్డు సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాంపూర్ జిపి లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

- సర్పంచ్ నాగమణి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం

ప్రతిపక్షం, చేగుంట, జనవరి13:

చేగుంట మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు చిన్నారులకు బహుమతులు ప్రధానం చేశారు. చేగుంట మండలం రాంపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ కాశబోయిన నాగమణి సుదర్శన్ చేతుల మీదుగా ప్రథమ ద్వితీయ తృతీయ నగదు బహుమతుల తో పాటు వివిధ రకాల బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అంగన్వాడి టీచర్ రామాకుమారి గ్రామపంచాయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం మహిళలు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.



రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- టిజిఎంపి డిసి ఎల్ డైరెక్టర్ ఫైనాన్సు తిరుపతిరెడ్డి ప్రకటన

ప్రతిపక్ష ప్రతినిధి హనుమకొండ జనవరి 13

హనుమకొండ జిల్లా హసన్పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో ప్రజాబాట కార్యక్రమం గ్రామస్తులతోపాటు జిల్లా స్థాయి విద్యుత్ అధికారులు మంగళవారం రోజు ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రజలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి గ్రీటింగ్ కార్డులు గ్రామ ప్రజలందరికీ అందజేశారు ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వం ప్రారంభించిన గృహజ్యోతి కార్యక్రమాన్ని తెల్ల రేషన్ కార్డు ఉన్న అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రామంలో ప్రజలందరికీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు సమస్యలు ఏమున్నాగాని అధికారులకు ఫిర్యాదుల ద్వార పరిష్కరించుకోవాలని ఆయన కోరారు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను అందిపుచ్చుకొని తద్వారా విద్యుత్ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు జిల్లాలోని టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు ఫోన్ చేసి సేవలందించేలా కృషి చేయాలని ప్రజలను కోరారు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం కావాలంటే వినియోగదారుల అవసరం ఎంతైనా ఉందని తద్వారా ప్రభుత్వానికి మనం తోడ్పాటు అందించినవారం తెలిపారు ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ ఫైనాన్స్ రౌతు చరణ్ దాస్ హనుమకొండ ఆపరేషన్ ఎస్సీ వి.మధుసూదన్ రావు ఎస్. ఏ. ఓ. నవీన్ కుమార్ డి ఈ సాంబ రెడ్డి ఏ డి ఈ అశోక్ కుమార్ ఏ ఏ ఓ రాజిరెడ్డి ఏ ఈ శిరీష్ కుమార్ సబ్ ఇంజనీర్ స్వామి నాయక్ లైన్ ఇన్స్పెక్టర్ రౌతు రమేష్ కుమార్ తదితర విద్యుత్ సిబ్బంది తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు



ముదిరాజ్ లు ఉన్నత స్థాయికి ఎదగాలి..

- విద్యార్థులకు పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కు సన్మానం..

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట జనవరి13

2024 25 వ సంవత్సరంలో ఉత్తమ విద్యార్థులకు మరియు ఉద్యోగ విరమణ పొందిన వారికి రంగదాంపల్లి ముదిరాజ్ సంఘము ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం హర్షించదగ్గ విషయమని రంగదాంపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఈర్ల సత్తయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 202425 వ సంవత్సరం లో 10వ తరగతి, ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించి ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగుల కు రంగదాంపల్లి పెద్దమ్మ దేవాలయం వద్ద వారిని ఘనంగా సన్మానించడం జరిగిందని..ముదిరాజ్ లు ఆర్థికంగా అభివృద్ధి చెంది అలాగే ముదిరాజ్ లు ఉన్నత స్థాయి కి ఎదగాలని వారన్నారు..ఈ కార్యక్రమంలో రంగదాంపల్లి ముదిరాజ్ సంఘము సభ్యులకు తదితరులు పాల్గొన్నారు..

సిద్దిపేట కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ..

- రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 13:



సిద్దిపేట కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి ,ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్టీఏ కమిటీ సభ్యులు సూర్యవర్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, టీఎన్జీవో నాయకులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... తెలంగాణ తల్లి విగ్రహంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ' గీతం, తెలంగాణ తల్లి విగ్రహాలు ప్రజా పాలన ఆత్మను ప్రజలకు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు.ప్రజలు కోరుకున్న విధంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను పేద ప్రజల కోసం అమలు చేస్తున్నామని చెప్పారు.ఈరోజు దుబ్బాక పట్టణంలో రూ.10 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, నాంచారిపల్లి గ్రామంలో కూడా రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. త్వరలో సిద్దిపేట పట్టణంలో రూ.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మంత్రి వెల్లడించారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సంక్షేమ పథకాలు వేగంగా ప్రజలకు చేరేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని అన్నారు.



చిట్యాల అమ్మవారి ఆలయం వద్ద సంక్రాంతి సంబరాలు

- సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తూ...
- చిట్యాల లో వినూత్న కార్యక్రమం
- గంగిరెద్దుల విన్యాసాలు
- హరిదాసు సందడి

ప్రతిపక్షం, చిట్యాల, జనవరి 13:

చిట్యాల కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపాలైన భోగిమంటలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు మంగళవారం ప్రదర్శించారు. పట్టణ చరిత్రలో తొలిసారిగా ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు విచ్చేసి సంబరాల్లో పాలుపంచుకున్నారు. ముందుగా స్థానిక శివాలయంలో పూజలు చేసిన అనంతరం సన్నాయి, మేళతాళాల చప్పుడుతో కాగడా జ్యోతితో అమ్మవారి ఆలయం వద్దకు విచ్చేసి భోగి మంటలను వెలిగించారు. చైర్మన్, డైరెక్టర్లు, పట్టణవాసులు, మహిళలు ఉత్సాహంగా డీజే సాంగ్స్ తో నృత్యం చేశారు. హరిదాసు సందడి చేశాడు. మహిళలు చిన్నారులు హరిదాసుతో ఫోటోలు దిగి సంబరపడ్డారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, రుద్రారపు లింగస్వామి, వరకాంతం నరసింహారెడ్డి, వనమా నిఖిల్ కుమార్, పట్టణ ప్రముఖులు పోకల దేవదాసు, జడల చిన్నమల్లయ్య, తెరేటుపల్లి హనుమంతు, పాటి మాధవరెడ్డి, వనమా వెంకటేశ్వర్లు, ఎద్దులపురి కృష్ణ, పందిరి రమేష్, గుండెబోయిన సైదులు, బొబ్బలి రామ్ రెడ్డి, బెల్లి సత్తయ్య, జెర్రిపోతుల సత్యనారాయణ, జిట్టా రవి, సిల్వేరు శేఖర్, బూర్గు కృష్ణయ్య, ఏళ్ల బయన్న, బుస శ్రీనివాస్, రాపోలు లక్ష్మయ్య, అల్లే శ్రీహరి, మధు, కుమ్మరి రవి, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేలకటూరు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 13:



సిద్దిపేట అర్బన్ మండలం వెల్గటూరు గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులు పెయ్యల తార భర్త నర్సింహులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని రాష్ట్ర కార్మిక, ఉపాధి, పరిశ్రమలు, భూగర్భ శాఖల మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారులను శాలువతో సన్మానించి, ఇంట్లో ఏర్పాటు చేసిన డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లబ్దిదారునికి స్వీట్లు తినిపించారు.మంత్రి మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలు సౌకర్యవంతమైన సొంత ఇళ్లలో నివసించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు కలగకుండా దశలవారీగా నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నామని మంత్రి పేర్కొన్నారు.అనంతరం గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను గ్రామస్థులు మంత్రికి విన్నవించగా, తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.



రాష్ట్ర వైద్య శాఖకు కేంద్రం ₹567 కోట్లు విడుదల చేసింది. 15వ ఆర్థిక సంఘం కింద ఇచ్చే ₹2600 కోట్లలో ఇవి చివరి విడత నిధులు. పీహెచ్‌సీ భవనాలు, డయాగ్నొస్టిక్ పరికరాలు, ఇతర అభివృద్ధి పనులకు వీటిని వినియోగించనున్నాం. కేంద్ర నిధులను పూర్తిగా సాధించాలని అధికారులను ఆదేశిచాం. విఫలమైతే సంబంధిత అధికారులే బాధ్యులు.

- ఏపీ మంత్రి సత్యకుమార్

ప్రాంతీయం



కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్
- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డిలో సమన్వయ సమావేశం

ప్రతిపక్షం ప్రతినిధి సంగారెడ్డి, జనవరి 13:

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి పట్టణంలో సమన్వయకర్తలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మున్సిపాలిటీ సమన్వయకర్త రాజానర్స్ పాల్గొన్నారు. 38వ వార్డుకు చెందిన నాయకులు, సమన్వయకర్తలతో ఎన్నికల వ్యూహాలు, వార్డు స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ సమన్వయకర్త రాజానర్స్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు అందరూ క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ గౌరవం

- న్యూయార్క్‌లోని కొలంబియా బిజినెస్ స్కూల్‌లో ప్రసంగించాలని ఆహ్వానం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 13:



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్ఠాత్మక ఆహ్వానం లభించింది. బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా చేసిన అసాధారణ కృషిని, తెలంగాణను ప్రపంచ పటంలో సమున్నత స్థాయిలో నిలిపిన తీరును గుర్తిస్తూ, అంతర్జాతీయ వేదికలపై తన ఆలోచనలను పంచుకోవాల్సిందిగా ఆయనకు ఆహ్వానం అందింది. సాంకేతికత, పాలన, సుస్థిర అభివృద్ధి, పట్టణ అభివృద్ధి మరియు ఆర్థిక వృద్ధిపై ఆయనకు ఉన్న లోతైన అవగాహన ప్రపంచవ్యాప్తంగా విద్యా, విధాన నిర్ణేత మరియు వ్యాపార వేదికలపై బలమైన ముద్ర వేసింది. ఈ క్రమంలో, న్యూయార్క్ నగరంలోని కొలంబియా బిజినెస్ స్కూల్ (సీబీఎస్)లో ఏప్రిల్ 4, 2026న జరగనున్న '21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్' (ఐబీఎస్)లో ప్రసంగించాలని కేటీఆర్‌కు ఆహ్వానం అందించింది. ఈ సదస్సును నిర్వహించే విద్యార్థి విభాగం 'సౌత్ ఆసియా బిజినెస్ అసోసియేషన్' (ఎస్ ఏ బి ఏ) ఈ మేరకు ఆయనను ఆహ్వానించింది. భారతదేశ వ్యాపార, ఆవిష్కరణ మరియు విధాన నిర్ణయ రంగాలపై మేధోమథనం జరిగే ప్రపంచంలోని అత్యున్నత వేదికలలో 'ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్' ఒకటి. గత 21 ఏళ్లుగా న్యూయార్క్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం పోషిస్తున్న పాత్రపై చర్చించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు మరియు ప్రవాస భారతీయులకు ఒక వేదికగా నిలుస్తోంది.

2026 ఎడిషన్ కాన్ఫరెన్స్‌లో 'జెరోధా' వ్యవస్థాపకులు నిఖిల్ కామత్ ప్రధాన వక్తగా వ్యవహరించనున్నారు. గతంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సీఈఓ నికేష్ అరోరా, డ్రీమ్ 11 సహ వ్యవస్థాపకులు హర్ష్ జైన్ వంటి ప్రముఖులు ఈ వేదికపై ప్రసంగించారు. ఇటీవలే హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగే 'హార్వర్డ్ ఇండియా కాన్ఫరెన్స్'కు ఆహ్వానం అందిన తరుణంలోనే, ఇప్పుడు కొలంబియా బిజినెస్ స్కూల్ నుండి కూడా ఆహ్వానం రావడం విశేషం. కేటీఆర్ నాయకత్వం మరియు విజన్ పట్ల అంతర్జాతీయ స్థాయిలో ఉన్న ఆసక్తికి ఇది నిదర్శనం. గత ఏడాది కూడా ఆయన ఆక్స్‌ఫర్డ్ ఇండియా వీక్ సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించి, తన స్పష్టమైన మరియు ముందుచూపుతో కూడిన ప్రసంగంతో అందరి ప్రశంసలు అందుకున్నారు.

కేటీఆర్‌ను 'విశిష్ట వక్త'గా ఆహ్వానించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రజా సేవలో ఆయన చేసిన కృషి, భారతదేశ అభివృద్ధి పథంలో ఆయన పోషించిన పాత్రను ఈ సందర్భంగా కొనియాడారు.



డాక్టర్ లావణ్య కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

- అడిషనల్ కలెక్టర్ కు డీబీఎఫ్, ఎమ్మార్పీఎస్ వినతి

ప్రతిపక్షం ప్రతినిధి,సిద్దిపేట, జనవరి 13: ప్రేమ పేరుతో మోసపోయి ఆత్మహత్య చేసుకున్న మెడికో విద్యార్థి డాక్టర్ లావణ్య కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని దళిత బహుజన ఫ్రంట్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి లు సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ కు విన్నవించారు. మంగళవారం నాడు డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్,యంపి అర్ పిఎస్ జాతీయ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్‌ల అధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ను కలిసి వినతిపత్రం సమర్పించి చర్చించడం జరిగింది. ఇందుకు అడిషనల్ కలెక్టర్ స్పందిస్తూ త్వరలో నష్టపరిహారం చెల్లిస్తామని హామి ఇచ్చారు.పునరావాసం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివెదిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ నేత పి. శంకర్,యంఅర్ పిఎస్ నేత లింగంపల్లి శ్రీ నివాస్ లు మాట్లాడుతూ ప్రేమించి వాడుకొవడానికి రాని కులం పెండ్లిచెసుకొవడానికి కులం అడ్డు రావడం సిగ్గు చేటన్నారు.నిందితుడి ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్డిఎఫ్ నేత పొచబొయిన శ్రీ హరి యాదవ్ మాట్లాడుతూ డా లావణ్య ఆత్మహత్య దళిత బహుజన పిల్లలకు గుణపాఠం కావాలన్నారు.తల్లిదండ్రులు సైతం అప్రమత్తంగా వుండాలన్నారు. కులం ఎక్కడ వుందనే వాదించే సనాతనవాదులకు డాక్టర్ లావణ్య మరణం ,కనిపించకపొవ సిగ్గుచేటన్నారు.డిబిఎఫ్ జిల్లా అధ్యక్షుడు భీమ్ శేఖర్,జిల్లా ప్రధాన కార్యదర్శి పొతరాజు శంకర్,యంఅర్ పిఎస్ నాయకులు జెర్రి పొతుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు, ఆటో ఢీ కొన్న ప్రమాదంలో ప్రయాణికులు గాయపడిన ఘటన పై మంత్రి తీవ్ర విచారం

- మెరుగైన వైద్యం అందించాలి
- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 13 :



సంగారెడ్డి నుండి నారాయణ ఖేడ్ వెళ్తున్న టీజీఎస్ ఆర్టీసీ బస్సు వైకుంఠ పురం సమీపంలో బస్సు ఫ్లేక్సీలను తరలించే ఆటో ను వెనుకనుండి డీ కొన్న ఘటనలో జరిగిన ప్రమాదంలో బస్సు లో ప్రయాణిస్తున్న బాలిక పూజ మృతి చెందటం తో పాటు 7 గురు ప్రయాణికులు గాయపడిన ఘటన పై మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నారాయణ ఖేడ్ మండలం రాయకల్ గ్రామానికి చెందిన పూజ బాసర లోని ఐఐటి మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న పూజ (17) ఈ ఘటన లో తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలించే సమయంలో చనిపోయిన సమాచారం తెలుసుకోని మంత్రి విచారం వ్యక్తం చేసారు. ఈ ఘటనలో గాయపడిన 7 గురు ప్రయాణికులకు మెరుగైన వైద్యాన్ని అందించాల్సిందిగా జిల్లా కలేక్టర్ ప్రావిణ్య, జిల్లా వైద్య శాఖాధికారి ని అదేశించారు. ఈ ఘటన లో నిషిత అనే ప్రయాణికురాలు చెయ్యి విరిగిపోయడం తో అమె కు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి లోని ప్రవేట్ అసుపత్రికి తరలించడం జరిగిందని మంత్రి కి వైద్య శాఖాధికారి వెల్లడించారు. స్వల్పంగా గాయపడిన ఇతర ప్రయాణికులకు చికిత్స అందించి అండగా నిలవాలని మంత్రి అదేశించారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట రహదారి భద్రతా చర్యలు

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 13:

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్టమైన రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో జరిగిన జిల్లాస్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు.

జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి, సమగ్ర ప్రణాళికతో నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే-65, 161లపై జంక్షన్ల వద్ద సరిపడా లైటింగ్, సూచిక బోర్డులు, స్టడ్స్, బ్లింకర్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. లైటింగ్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, అంబులెన్స్ డ్రైవర్లకు సీపీఆర్‌పై శిక్షణ అందించాలని ఆదేశించారు. తదుపరి సమావేశానికి యాక్షన్ టేకెన్ రిపోర్టుతో హాజరుకావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు, ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బి, వైద్య, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.



వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

- జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 13:

రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగూర్ జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలో గ్రౌండ్ వాటర్ పరిస్థితిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నివేదిక సమర్పించాలని సూచించారు. నారాయణఖేడ్ ప్రాంతంలో ప్రత్యేక చర్యలు తీసుకుని తాగునీటి సమస్య రాకుండా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.బోర్వెల్ పంప్‌సెట్ల వివరాలు సేకరించి, అవసరమైన మరమ్మతులు వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో జాయింట్ ఇన్‌స్పెక్షన్లు నిర్వహించి సమస్యలు ముందే పరిష్కరించాలని సూచించారు.అనంతరం క్రీడా సదుపాయాలపై సమీక్ష నిర్వహించి, సంగారెడ్డి స్విమ్మింగ్ పూల్ మరమ్మతులు వేగవంతం చేయాలని, అంబేద్కర్ స్టేడియంలోని జిమ్ పరికరాలు పునఃస్థాపన చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించి, చిన్న మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం మండల అధ్యక్షుడిగా ముత్యాల బాలరాజు

ప్రతిపక్షం సిద్దిపేట, జనవరి:



సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సిద్దిపేట జిల్లా కొండపాక మండల అధ్యక్షుడిగా ముత్యాల బాలరాజు ను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెసిడెంట్ జితేందర్ రెడ్డి, జిల్లా ఇంచార్జి వేల్పుల మహేందర్ హర్షం వ్యక్తం చేస్తూ, ఈ నియామకం సంస్థను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. కొండపాక మండలంలో సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన పెంచడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.



బి రమేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ప్రతిపక్షం సిద్దిపేట, టౌన్, జనవరి 13:

సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్ లో మాజీ మున్సిపల్ చైర్మన్ విగ్రహం వద్ద బి రమేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. బి రమేష్ ఫౌండేషన్ చైర్మన్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బాసంగారి వెంకట్ పిల్లలకు పతంగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బి రమేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. గత 15 సంవత్సరాల నుండి తన తండ్రి గారి పేరిట బి రమేష్ ఫౌండేషన్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.





'కాల్ ఫర్ బ్లడ్ ఫౌండేషన్'.. యాప్‌ను ప్రారంభించిన డీజీపీ శివధర్‌రెడ్డి

ప్రతిపక్షం హైదరాబాద్:



ఆపదలో ఉన్న వారికి రక్తం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రాకూడదనే సంకల్పంతో రూపొందించిన 'కాల్ ఫర్ బ్లడ్ ఫౌండేషన్' వెబ్ అప్లికేషన్‌ను డీజీపీ శివధర్ రెడ్డి ప్రారంభించారు. రక్తదాతలు, రక్తం అవసరమైన బాధితులను ఒకే వేదికపైకి తెస్తూ.. అత్యవసర సమయంలో వేగంగా స్పందించేలా ఈ యాప్ ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయడ్డారు. రక్తదాతల వివరాలు సేకరించడంతో పాటు, అవసరమైన సమయానికి వారిని గుర్తించే ప్రక్రియను ఈ వేదిక సులభతరం చేస్తుంది. ఆధునిక సాంకేతిక ప్రమాణాలతో రూపొందించిన ఈ అప్లికేషన్‌లో దాతల వ్యక్తిగత వివరాలకు పూర్తి స్థాయిలో భద్రత ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సామాజిక బాధ్యతతో ఈ యాప్ రూపొందించిన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చింతల సంపత్‌ను డీజీపీ శివధర్ రెడ్డి అభినందించారు. రక్తదాన ప్రక్రియను డిజిటలైజ్ చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



బక్రిచెప్యాలలో ఘనంగా ముగ్గుల పోటీలు

ప్రతిపక్షం సిద్దిపేట టౌన్, జనవరి 13:

సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలో గ్రామ సర్పంచ్ జక్కుల శ్రీలత శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద మహిళలు సంక్రాంతి పండగను ప్రతిబింబించేలా రంగురంగుల ముగ్గులు వేశారు. దశమి ఆసుపత్రి నిర్వహకుడు శ్రీకాంత్ సౌజన్యంతో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు మొదటి, ద్వితీయ, తృతీయ నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సెక్రటరీ శ్రీవాణి, గ్రామ సర్పంచ్ జక్కుల శ్రీలతశ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నరేష్, వార్డు మెంబర్లు శ్రీనాథ్, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.



మతాలకు అతీతంగా ముగ్గుల పోటీల నిర్వహణ..

- ముత్తంగిలో ముగ్గుల పోటీలకు హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 13 :

ముత్తంగి డివిజన్ పరిధిలోని సాయి ప్రియ కాలనీలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని సీనియర్ నాయకులు మొహమ్మద్ ఆబెద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి అత్యుత్తమ ముగ్గులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రతి ఏటా మతాలకు అతీతంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం, సామాజిక కార్యక్రమాల్లో ముందుంటున్న మహమ్మద్ ఆబేద్ ను ఎమ్మెల్యే అభినందించారు. బహుమతులు గెలుచుకున్న విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ ఓల్డ్ సిటీలో చాలా మంది కరెంట్ బిల్లులు చెల్లించట్లేదు . పాతబస్తీలో ప్రతిరోజు 20 లక్షల యూనిట్ల ఎలక్ట్రిసిటీని దొంగిలిస్తున్నారు. అంటే దాని విలువ ఏడాదికి రూ.500 కోట్లు. ఇది 2023 డేటా. ఇప్పుడు ప్రతి ఏడాది రూ.600 కోట్లకు పైగా ఉండొచ్చు.

- బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

చలితో ఢిల్లీ గజగజ..



ఉత్తరభారతాన్ని చలిపులి వణికిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, హర్యానా సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీ లో ఈ సీజన్‌లోనే అత్యంత కనిష్టానికి ఉష్ణోగ్రతలు పతనమయ్యాయి.మంగళవారం ఉదయం రాజధానిలో ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఈ శీతాకాలంలో ఇదే అతికనిష్ట ఉష్ణోగ్రత కూడా. దీంతో చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణికిపోతున్నారు. చలి మంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. మరోవైపు ఉత్తరాది రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తీవ్రమైన చలిగాలులు, దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మరోవైపు ఢిల్లీ నగరంలో వాయు కాలుష్యం కూడా తీవ్రంగానే ఉన్నది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం..మంగళవారం ఉదయం ఢిల్లీలో ఏక్యూఐ లెవెల్స్ వెరీ పూర్ కేటగిరీ (337)గా నమోదయ్యాయి.


విశ్వ వీక్షణం



ట్రంప్‌కు ఇరాన్ స్ట్రాంగ్ కౌంటర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలకు కౌంటర్ ఇచ్చింది ఇరాన్. శత్రువుల గురించి తమకు తెలుసని, తాము బలంగా ఉన్నామని హెచ్చరించింది. వారిని ఎదుర్కోనేందుకు మేం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ చెప్పారు. "మా దేశం శత్రువుల ముందు తలొగ్గదని పలుమార్లు చాటిచెప్పాం. ఇప్పటికైనా అమెరికా రాజకీయ నాయకులు తమ మోసపూరిత చర్యలు ఆపాలని, మా దేశానికి ద్రోహం చేస్తోన్న కిరాయి వ్యక్తులపై ఆధారపడటం మానేయాలని హెచ్చరిస్తున్నాం. ఇరాన్ బలమైన, శక్తిమంతమైన దేశం. మాకు శత్రువు గురించి తెలుసు. వారిని ఎదుర్కోనేందుకు మేం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం" అని ఖమేనీ రాసుకొచ్చారు.శత్రువుల గురించి తమకు తెలుసని, తాము బలంగా ఉన్నామని హెచ్చరించింది. దేశంలో జరిగిన ప్రభుత్వ అనుకూల సమావేశాలు విదేశీ శత్రువుల ప్రణాళికలను విఫలం చేశాయని తెలిపింది. ఈ మేరకు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. మంగళవారం ప్రభుత్వానికి అనుకూలంగా రాజధాని నగరం టెహ్రాన్‌లోని ఎంఘెలాబ్ స్క్వేర్ వద్ద వేల మంది ప్రదర్శనకారులు గుమిగూడారు.దేశాధ్యక్షుడు పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తదితరులు అందులో పాల్గొన్నారు.

మరోవైపు అనేక ప్రాంతాల్లో విధించిన ఇంటర్‌నెట్ బ్యాన్‌పై ఇరాన్ నేషనల్ సెంటర్ ఫర్ సైబర్ స్పేస్ అధ్యక్షుడు స్పందించారు. అల్లర్ల నేపథ్యంలో జనవరి 9న విధించిన ఇంటర్‌నెట్ నిషేధం కొనసాగుతుందని తెలిపారు. అధికారులు భద్రతా పరిస్థితులను అంచనా వేసిన అనంతరం బ్యాన్ తొలగింపుపై నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ప్రత్యర్థులు చేపడుతున్న దేశ వ్యతిరేక చర్యలను ఎదుర్కొనేందుకు ఇంటర్‌నెట్ నిషేధం అవసరమని అభిప్రాయపడ్డారు. అయితే, అవసరమైన ఆన్‌లైన్ సేవలను నిర్వహించేందుకు వీలుగా నేషనల్ ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్ వ్యవస్థ అమలులో ఉందని వివరించారు.సుమారు 646 మంది ఆందోళనకారులు మృతి పెరిగిన ధరలకు తోడు రికార్డు స్థాయిలో కరెన్సీ విలువ పతనం, ఆర్థిక సంక్షోభం వల్ల ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజధాని టెహ్రాన్‌లో ప్రారంభమైన ఆందోళనలు వివిధ ప్రాంతాలకు విస్తరించాయి.



కనుమరుగవుతున్న గంగిరెద్దుల విన్యాసాలు

- సంచార జీవనంతో చదువుకు దూరం

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 13:

సంక్రాంతి పండుగ సందర్భంగా గంగిరెద్దు విన్యాసాలు కనువిందు చేస్తాయి. ఒకప్పుడు ప్రతి వీధిలో దర్శనమిచ్చే ఈ సంప్రదాయం ఇప్పుడు అరుదుగా మారింది. ఒకప్పుడు సంక్రాంతి పండుగ వచ్చిందంటే గొబ్బెమ్మలు, రంగురంగుల ముగ్గుల మధ్య గంగిరెద్దుల విన్యాసాలు పల్లెలకు కొత్త కళను తెచ్చేవి. సంక్రాంతి వేళ ఇళ్ల ముంగిళ్లలోకి వచ్చే దూడూ బసవన్నల ఆశీర్వచనాలు నేడు కనుమరుగు అవుతున్నాయి. మారుతున్న కాలంతో పాటు గంగిరెద్దుల సంస్కృతి నేడు పూర్తిగా అంతరించిపోతున్నది. కొడుకు చల్లగుండనీ, ఇల్లు చల్లగుండనీ, అన్నదానం, పుణ్య దానం, గోదానం, వస్త్రదానం చేసే ధర్మాత్ముల ఇల్లు చల్లగుండనీ, భగవంతుని దీవెన కలుగనీ, అమ్మగారికి దండం పెట్టు.. అయ్యగారికిదండం పెట్టు అంటూ పొట్ట చేతబట్టుకుని ఊరూర తిరిగి బిక్షాటన చేసే గంగిరెద్దులోళ్ల జీవితాల్లో విషాదమే మిగులుతోంది. స్థిరనివాసం లేకపోవటంతో పొట్టకూటి కోసం ఊరూరు తిరుగుతూ గంగిరెద్దు ప్రదర్శనలతో పొట్టు నింపుకుంటున్నారు. సంవత్సరానికి ఎనిమిది నెలలపాటు సంచార జీవితాన్ని గడిపే వీరి పిల్లలు చదువుకు దూరమై కులవృత్తిలో మగ్గిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గంగిరెద్దుల ఆటలతో వినోదాన్ని, ఆనందాన్ని అందించే వీరు అర్థాకలితో అలమటిస్తున్నారు. మారుతున్న కాలంతో పాటు కుప్పలు, తెప్పలుగా వచ్చి పడుతున్న ఆధునిక వినోద సాధనాల వల్ల తరతరాలుగా తెలుగు సంస్కృతిలో ఇమిడి పోయిన జానపద కళారూపాలు కాలగర్భంలో కలసిపోతున్నాయి. ఈ కళారూపాలపై ఆధారపడి బతుకుతున్న వారు దుర్భర పరిస్థితుల్లో బతుకు వెళ్లదిస్తున్నారు.ఉపాధి లేకపోవడంతో గంగిరెద్దు కళాకారులు ఇతర వృత్తులకు మారుతున్నారు. దీంతో ఈ జానపద కళ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలంలోని మండలంలోని గట్లమల్యాల, నంగునూరు, ముండ్రాయి, సిద్ధిపేట అర్బన్ మండలంలోని నాంచార్ పల్లి, చేర్యాల మండలంలోచేర్యాల,ఆకునూరు,దుబ్బాక మండలంలోలోని ధర్మాజీపేట గ్రామాల్లో దాదాపు 500 పైగా గంగిరెద్దుల కుటుంబాలకు చెందినవారు నివసిస్తున్నారు. వీరంతా తమ ఉపాధి కోసం సంవత్సరానికి ఎనిమిది నెలలు సంచార జీవనం సాగిస్తూ గంగిరెద్దులను ఆడించి బిక్షాటన చేస్తారు. మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధర ఉండే దువ్వెనలు, కాటుక డబ్బాలు, పిన్నీసులు, పౌడర్ డబ్బాలు, స్నోవంటి అలంకార వస్తువులు అమ్ముతారు. ఈ సమయంలో అన్నం అడుక్కుంటారు. అన్నం దొరకని సమయంలో మగవారు గంగిరెద్దులను ఆడించి అడుక్కొచ్చిన బియ్యం వండుకుని తింటారు. సంచారంతో పొట్ట పోసుకునే గంగిరెద్దుల వారు ఊరూరు తిరిగి గంగిరెద్దులాట సంబరాలను ప్రజలకు అందిస్తున్నప్పటికీ పూట గడవటం లేదు. ఎర్రగొల్ల కులానికి ఉపకులంగా ఉండే గంగిరెద్దుల వాళ్ల జీవన సమరం ప్రతిరోజు తెల్లవారక ముందే మొదలవుతుంది. వీరు సంచార జీవనంతో ఉపాధి పొందుతున్నందున వీరి పిల్లలు సైతం వీరితో పాటే వెళుతున్నారు. ఫలితంగా చదువుకు దూరమై కులవృత్తిలో స్థిరపడుతూ బిక్షాటన చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం నాలుగు గంటలకే మేల్కొని తమ గంగిరెద్దులను రకరకాల బట్టలతో అలంకరించు కుని సన్నాయి, డోలు వాయిస్తూ గంగిరెద్దులను ఇంటింటికి తిప్పి దాన్యం, బియ్యం, డబ్బు, బట్టలను అడుక్కుంటారు. ప్రతి సంవత్సరం జులై నెలలో మొదలయ్యే వీరి సంచార జీవనాన్ని ఫిబ్రవరినెలలో ముగించుకుని స్వస్థలం చేరుకుంటారు. వందలాది మైళ్ల దూరం తమ కుటుంబ సభ్యులు, పిల్లలతో కలసి కాలి నడకన వెళ్లి తమ కళలను ప్రదర్శిస్తారు. గ్రామ శివారులో తమ గుడారాలను వేసుకుంటారు. తర్వాత గ్రామ సర్పంచినో, గ్రామ పెద్దనో కలుసుకుని గంగిరెద్దుల ఆటకు శ్రీకారం చుడతారు. గంగిరెద్దులు వాటి యజమానులు చెప్పింది చేయటం అందరికి ఆశ్చర్యం కలిగిస్తుంది. గంగిరెద్దులు అలిగి పడుకోవటం, నాభి కమలం, పులిగావువంటి ఆటలు ప్రధానమైనవి. పులిగావులో మనిషి మెడను గంగిరెద్దు పళ్ల మధ్య పెట్టుకుంటుంది. నాభికమలంలో గంగి రెద్దు బ్యాలెన్సింగ్ గా నాలుగు కాళ్ళను కాస్త మనిషి పొట్టపై పెట్టడం చూస్తే ఒళ్లు జలదరిస్తుంది. ఇలా ప్రదర్శనలు ఇచ్చి ఇంటింటికి తిరుగుతూ భిక్షాటన చేస్తారు. ఒకప్పుడు ధాన్యం పోగా గ్రామ సర్పంచి, గ్రామ పెద్ద మనుషుల ద్వారా రూ.116 ల నుంచి రూ.516ల వరకు లభించేవి. ఎవరైనా చనిపోయిన వారిని ఖననం చేసేందుకు వెళ్లే సమయంలో గంగిరెద్దులను ఆడించి అడుక్కుంటారు. ప్రస్తుతపరిస్థితుల వల్ల పంటలు పండలేదని ఎవరు కూడా ధాన్యం పెట్టడం లేదని గంగిరెద్దుల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో గంగిరెద్దుల ఆటకు ఆదరణ తగ్గటంతో అర్ధాకలితో అలమటించాల్సి వస్తోందంటున్నారు. గంగిరెద్దుల వారు భిక్షాటనకు వెళ్లిన సమయంలో ఒక గ్రామంలో ఆదరణ లభిస్తే మరో గ్రామంలో చీత్కరించుకోవడం కూడా జరుగుతుంది. అయినా వీరు అన్ని గ్రామాలను సమానంగా భావిస్తుంటారు.

ఆచార వ్యవహారాలు ఆసక్తికరం

గంగిరెద్దుల వారిలో బాల్యవివాహాలు అధికం. పదేళ్ల వయసు రాగానే పెళ్లి చేస్తారు. దీంతో 16 సంవత్సరాల వయస్సు వచ్చేసరికే తల్లిదండ్రులుగా మారిపోతారు. కట్నాలు వీరిలో లేవు. ఒక గేదెను కట్నం కింద పెళ్లిలో ఇస్తారు. వీరు విడాకులైనా, వివాదాలైనా వీరిలో వీరే తీర్చుకుంటారు. విడాకులు తీసుకునే సమయంలో జరినామా విధించి విడాకులు అయినట్లు ప్రకటిస్తారు. సంతానం కలిగిన తర్వాత విడాకులు తీసుకునే వీలు లేదు.

గంగిరెద్దులతో అడుక్కునే వీరు కుక్కలను ఎక్కువగా పెంచుతారు. కుక్కల ద్వారా అడవి జంతువులను వేటాడుతారు, పంట పొలాల్లో ఎలుకల రంధ్రాలను తవ్వి అవి నిల్వ చేసు కున్న ధాన్యాన్ని సేకరిస్తారు. బిక్షాటన చేసే గంగిరెద్దుల వారిని ధర్మ సేవకులుగా పలువురు భావిస్తారు. గంగిరెద్దులతో ఆశీర్వాదం తీసుకోవటం, దాని కాలి దుమ్మును నుదుట పెట్టుకోవటం శుభంగా కొన్ని గ్రామాల్లో భావిస్తారు. కొందరు గంగిరెద్దు కాళ్లు కడిగి బొట్లు పెడతారు. ఎవరైనా చనిపోయినప్పుడు గంగిరెద్దుల వాళ్లు సన్నాయి పాడుతూ గంగిరెద్దును ఆడిస్తూ శవాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లేటప్పుడు ముందు నడుస్తారు. సన్నాయి పాటల్లో కూడా తేడాలుంటాయి. పండుగలప్పుడు హుషారు గొలిపే పాటలను గంగిరెద్దుల వారు సన్నాయి ద్వారా వినిపిస్తే ఎవరైనా చనిపోయినప్పుడు విషాదం నింపే పాటలను వినిపిస్తారు. శవ దహనం పూర్తయ్యే వరకు ఉండి ఆ తర్వాత మెల్లగా డబ్బులు అడుక్కుంటారు. చనిపోయిన బాధలో ఉన్నవారిని డబ్బులు అడగటం ఇబ్బందిగానే ఉన్నప్పటికీ పొట్టకూటి కోసం తప్పదంటారు. కొన్నిచోట్ల తిరస్కారం ఎదురైనా అడుక్కోక తప్పటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాతల కాలం నుంచి గంగిరెద్దులను ఆడిస్తూ బతుకు వెళ్లదీస్తున్న గంగిరెద్దుల వారు గంగిరెద్దులను ప్రాణం కంటే మిన్నగా చూసుకుంటారు. వీరి పిల్లలకు, వీరి కుటుంబ సభ్యులకు జ్వరాలొచ్చి మంచాన పడ్డా విచారించరు. గంగిరెద్దులకు చిన్న సుస్తీ చేసినా అల్లాడి పోతారు. పసి పిల్లలకంటే మిన్నగా సాకుతారు. దేవునితో సమానంగా పూజి స్తారు. వీటికి రాముడు, భీముడు వంటి పేర్లు పెట్టి మురిసిపోతారు. సంక్రాంతి పండగ రోజుల్లో గంగిరెద్దుల వారికి పైసో పరకో దొరుకుతుంది. ఈ సమయంలో వంట చేతికి వచ్చి రైతుల ఇండ్లు ధాన్యంతో కళకళలాడుతాయి. దీంతో గంగిరెద్దుల వారు. ఇంటింటికి వెళ్లి సంక్రాంతి సమయంలో సన్నాయి పాట వినిపించి అడుక్కుంటారు. స్థాయిని బట్టి ఎవరికి తోచింది వారు ఇస్తారు. గంగిరెద్దులకు పాత బట్టలు పెట్టేవారు కూడా ఉంటారు. గతంలో పీక మీద(సన్నాయి మీద) గంగిరెద్దుల వారు పాట పాడితే వంకా పాడాలని కోరేవారు. ప్రస్తుతం తాము పాట మొదలు పెడితే చాలు ఆపు పాడు గోల అంటూ విసుక్కుంటున్నారని గంగిరెద్దుల వారు వాపోతున్నారు. పొట్టకూటి కోసం గంగిరెద్దులను తీసుకుని ఎంత దూరమైనా నడిచి వెళతారు. అర్ధాకలితో నిత్యం జీవన పోరాటం చేస్తూ పొట్ట పోసుకుంటున్న గంగిరెద్దుల వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు కోరుతున్నారు.



పిల్లలకు హాస్టల్ వసతి కల్పించాలి: జిడ్డి సారయ్య

సంచార జీవనం గడపటం వల్ల వారి పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని నంగునూరుకు చెందిన జిడ్డి సారయ్య చెప్పారు. తమ పిల్లలకు చదువు చెప్పించి అక్షరాస్యులుగా మారటానికి హాస్టల్ వసతి కల్పించాలని కోరాడు.

ఉపాధి కల్పించాలి: జిడ్డి కనకయ్య

గంగిరెద్దుల ఆటకు ఆదరణతగ్గటంతో ఆ కలితో అలమటిస్తున్నామని జిడ్డి కనకయ్య వాపోయారు. తమకు ఉపాధి మార్గం చూపించి ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.

ప్రభుత్వ పథకాల గురించి తెలియదు: జిడ్డి నరేశ్

గంగిరెద్దుల వారు సంచార జీవితం వల్ల అక్షరాస్యతకు దూరమవటమే కాక, ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను కూడా తెలుసుకుని వినియోగించుకోలేక పోతున్నారని జిడ్డి నరేశ్ తెలిపారు. ప్రభుత్వం గంగిరెద్దులోళ్లకు స్థిరనివాసం కల్పించటం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొన్నింటిని వీరికోసం ప్రత్యేకంగా కేటాయించాలని కోరారు.

విజయ్‌కు సీబీఐ సెకండ్ నోటీస్



కరూర్ తొక్కిసలాట కేసులో టీవీకే అధినేత, నటుడు విజయ్‌కు సీబీఐ మరోసారి సమన్లు జారీ చేసింది. జనవరి 19న విచారణకు హాజరు కావాలని సూచించింది. ఈ కేసులో సీబీఐ జనవరి 12న విజయ్‌ని విచారించిన విషయం తెలిసిందే. మంగళవారం మరోసారి రావాలని సీబీఐ సూచించినప్పటికీ.. జన నాయగన్ సినిమా విడుదలతోపాటు సంక్రాంతి నేపథ్యంలో మరింత సమయం కావాలని విజయ్ విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది.గతేడాది సెప్టెంబరు 27న విజయ్ ప్రచారసభలో జరిగిన తొక్కిసలాటలో 41మంది మరణించిన ఘటనపై సీబీఐ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో జనవరి 12న దిల్లీలోని కేంద్ర దర్యాప్తు సంస్థ ముందు విజయ్ హాజరు కాగా.. ఆరు గంటల పాటు విచారించింది. మరోవైపు, ఈ కేసులో అనేక లోపాలున్నాయని టీవీకే ఆరోపించింది. ఘటన జరిగినప్పుడు అక్కడున్న పోలీసుల సంఖ్యపై ముఖ్యమంత్రి, డీజీపీ వేర్వేరు ప్రకటనలు చేశారని పేర్కొంది. మరోవైపు జన నాయగన్ సినిమా విడుదల అంశం త్వరలోనే పరిష్కారమవుతుందని తెలిపింది.



రక్తసిక్తమైన ఇరాన్

ఇరాన్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనల్లో భారీ సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఆరు వందల మందికి పైగా చనిపోయినట్లు అధికారిక సమాచారం రాగా.. ఈ సంఖ్య రెండు వేల వరకు ఉండొచ్చని ఇరాన్ అధికారులు సంకేతాలిచ్చారు. అక్కడ పెరుగుతోన్న హింస చాలా భయపెడుతోందని ఐరాస మానవ హక్కుల సంఘం కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో ఇరాన్‌కు చెందిన వెబ్‌సైట్ మాత్రం ఇటీవల ఆందోళనల్లో పది వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సంచలన కథనంలో పేర్కొంది.దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో పౌరులతో పాటు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థతో ఇరాన్ అధికారులు వెల్లడించారు. ఈ మరణాల వెనక ఉగ్రవాదులు ఉన్నారని ఆరోపించారు. మరోవైపు ఇటీవల ఘర్షణల్లో 12 వేల మంది చనిపోయినట్లు 'ఇరాన్ ఇంటర్నేషనల్' కథనం పేర్కొంది. భద్రతా సంస్థలు, అధ్యక్ష కార్యాలయం, ప్రత్యక్ష సాక్షులు, వైద్యాధికారులు.. తదితర వర్గాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ అంచనా వేసినట్లు తెలిపింది. జనవరి 8, 9 తేదీల్లోనే ఈ మరణాలు చోటుచేసుకున్నాయని, ఓ ప్రణాళిక ప్రకారమే ఈ హింసాత్మక ఘటనలు జరిగాయని వెల్లడించింది. ఆధునిక ఇరాన్ చరిత్రలో ఈ తరహా హింస ఎన్నడూ చోటుచేసుకోలేదని పేర్కొంది.దేశ వ్యాప్తంగా 31 ప్రావిన్సుల్లో 600లకుపైగా ప్రదేశాల్లో నిరసనలు కొనసాగినట్లు అమెరికా కేంద్రంగా నడిచే మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ పేర్కొంది. వందలాది మంది మృతి చెందగా, 10వేలకు పైగా నిరసనకారులను అక్కడి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపింది. అయితే, ఈ భయంకరమైన హింసాత్మక ఘటనలు ఇలాగే కొనసాగితే చాలా కష్టమని.. ఇరాన్ పౌరుల న్యాయమైన డిమాండ్లను తప్పక వినాల్సిందేనని ఐరాస మానవ హక్కుల హైకమిషన్ పేర్కొంది. మరణాలు వందల సంఖ్యలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని ఆ సంస్థ అధికార ప్రతినిధి జెరెమీ లారెన్స్ పేర్కొన్నారు. అంతేకాదు.. అరెస్టైన వారిలో అనేక మందికి మరణశిక్ష పడవచ్చనే ఆందోళన వ్యక్తం చేశారు.



గుజరాత్ జెయింట్స్‌పై ముంబయి గెలుపు

మహిళల ప్రీమియర్ లీగ్ 2026(డబ్ల్యూపీఎల్)లో భాగంగా గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ ఘన విజయం సాధించింది. 193 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ముంబయి 19.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ముంబయికి ఇది రెండో విజయం. అమన్‌జ్యోత్ కౌర్ 40 (26 బంతుల్లో), హర్మన్ ప్రీత్ కౌర్ 71* (43 బంతుల్లో), నికోలా కెరీ 38* (23 బంతుల్లో), మాథ్యూస్ 22 (12 బంతుల్లో), జి.కమలిని 13 (12 బంతుల్లో) రన్స్ చేశారు. గుజరాత్ బౌలర్లలో రేణుకా సింగ్, కష్వీ గౌతమ్, సోఫీ డివైన్ తలో వికెట్ పడగొట్టారు. 16వ ఓవర్‌లో రేణుకా సింగ్ బౌలింగ్‌లో నికోలా కెరీ 4 ఫోర్లు బాదింది. మరో ఫోర్ లెగ్‌బైస్ రూపంలో వచ్చింది. దీంతో ఆ ఒక్క ఓవర్‌లోనే 20 పరుగులు వచ్చాయి. అంతకు ముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. ఐదో స్థానంలో వచ్చిన జార్జియా వేర్‌హామ్ (43*; 33 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచింది. కనికా అహుజా (35; 18 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బెత్ మూనీ (33; 26 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), భారతీ పుల్మాలి (36*; 15 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. ఆష్లీన్ గార్డ్‌నర్ (20; 11 బంతుల్లో 4 ఫోర్లు) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయింది. ఆయుషి సోనీ (11) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. 9 ఓవర్లకు 96/2తో ఉన్న గుజరాత్.. 17 ఓవర్లకు 143/5తో నిలిచింది. చివర్లో భారతి చెలరేగింది. దీంతో ఆఖరి మూడు ఓవర్లలో ఆ జట్టు 49 పరుగులు చేసింది. ముంబయి బౌలర్లలో షబ్నిమ్, హేలీ మాథ్యూస్, నికోలి కెరీ, అమేలియా కెర్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



సెమీస్‌లోకి పంజాబ్, విదర్భ..

జయ్ హజారే ట్రోఫీ 202526లో సెమీస్ బెర్తులు ఖరారయ్యాయి. ఇప్పటికే కర్ణాటక, సౌరాష్ట్ర సెమీస్‌కు చేరగా.. మిగిలిన రెండు బెర్తులను పంజాబ్, విదర్భ సొంతం చేసుకున్నాయి. మధ్యప్రదేశ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో పంజాబ్ 183 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత పంజాబ్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 345 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (88), అన్మోల్‌ప్రీత్ సింగ్ (70), నేహల్ వధేరా (56), హర్నూర్ సింగ్ (51) రాణించారు. లక్ష్యఛేదనలో మధ్యప్రదేశ్ 31.2 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌటైంది. రజత్ పటిదార్ (38) టాప్ స్కోరర్. కెప్టెన్ వెంకటేశ్ అయ్యర్ డకౌటయ్యాడు. పంజాబ్ బౌలర్లలో సన్వీర్ సింగ్ 3, క్రిష్ భగత్, గుర్నూర్ బ్రార్, రమణ్‌దీప్ సింగ్ రెండేసి వికెట్లు తీశారు. మయాంక్ మార్కండేకు ఒక వికెట్ దక్కింది.దిల్లీతో జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో విదర్భ 76 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. యశ్ రాథోడ్ (86), అథర్వ తైడే (62), ధ్రువ్ షోరే (49) మెరిశారు. లక్ష్యఛేదనలో దిల్లీ 45.1 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌటైంది. అనుజ్ రావత్ (66) అర్ధశతకం చేయగా.. ప్రియాంశ్ ఆర్య(28), వైభవ్ (28), హర్ష్ త్యాగి (27), హృతిక్ షోకిన్ (21) రన్స్ చేశారు. విదర్భ బౌలర్లలో నచికేత్ భూతే 4, హర్ష్ దూబె 3, ప్రఫుల్ హింగే 2, యశ్ కదమ్ ఒక వికెట్ పడగొట్టారు. సెమీ ఫైనల్స్ విషయానికొస్తే.. జనవరి 15న కర్ణాటకతో విదర్భ, 16న సౌరాష్ట్రతో పంజాబ్ తలపడనున్నాయి.



కోహ్లీ క్లాస్.. శ్రేయస్ కమ్‌బ్యాక్

టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌లో అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఆదివారం వడోదర వేదికగా టీమ్‌ఇండియా, న్యూజిలాండ్‌కు మధ్య జరిగిన మ్యాచ్‌లో అతడు తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. 91 బంతుల్లో 93 పరుగులు చేసి.. టీమ్‌ఇండియా విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. విరాట్‌కిది వరుసగా ఏడో 50+ స్కోర్. ప్రస్తుతం భారత జట్టు సిరీస్‌లో 10 ఆధిక్యంలో ఉంది. ఈ సందర్భంగా టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా విరాట్ బ్యాటింగ్ ఫామ్‌పై మాట్లాడాడు.'అతడు ప్రస్తుతం బ్యాటింగ్ గురించి తప్ప ఏ విషయమూ ఆలోచించడం లేదు. అతడిలో ఏ మార్పూ లేదు. క్రికెట్‌ను ఎంజాయ్ చేస్తున్నాడు. తన బాల్యంలో ఎలా క్రికెట్ ఆడాడో.. ఇప్పుడూ అదే యాటిట్యూడ్‌ను కొనసాగిస్తున్నాడు. దానికి అతడి ఏళ్ల అనుభవం తోడైంది' అని అశ్విన్.. విరాట్‌ను కొనియాడాడు. అలాగే అతడు వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గురించి కూడా ప్రస్తావించాడు. 'వన్డే క్రికెట్‌లో శ్రేయస్ అయ్యర్ నిలకడకు పెట్టింది పేరు. అతడు అవుటైన తీరు బాధాకరం. అతడు అలా మధ్యలో నిష్క్రమించడు. కచ్చితంగా ఆటను పూర్తి చేస్తాడు. కానీ.. మనం ఓ విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఇది అతడికి కమ్‌బ్యాక్. అలాగే జెమీసన్ చక్కటి బంతికి శ్రేయస్ అయ్యర్ వికెట్ తీసుకున్నాడు' అని అశ్విన్ విశ్లేషించాడు. ప్లీహానికైన గాయం నుంచి కోలుకున్న శ్రేయస్ అయ్యర్.. కొన్ని నెలల విరామం తర్వాత న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి వన్డేతో పునరాగమనం చేశాడు. ఈ మ్యాచ్‌లో అతడు 47 బంతుల్లో 49 పరుగులు చేశాడు. అలాగే విరాట్ కోహ్లీతో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు.

ఆటలు

@prathipaksham

prathipaksham tv telugu

టైటిల్‌పై భారత షట్లర్ల గురి



ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీపై భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్ గురిపెట్టారు. సొంతగడ్డ ప్రయోజనాన్ని సానుకూలంగా మలుచుకుని ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను సొంతం చేసుకోవాలని సింధు, లక్ష్యసేన్ పట్టుదలగా ఉన్నారు. గతంలో భారత్ తరఫున సైనా నెహ్వాల్ (2010).. కిదాంబి శ్రీకాంత్ (2015).. సింధు (2017).. లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్ చిరాగ్‌శెట్టి (2022) ఇండియా ఓపెన్‌లో విజేతలుగా నిలిచారు. మంగళవారం ప్రారంభమయ్యే ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో నుయన్ లిన్ (వియత్నాం)తో సింధు, పాయ్ యు (చైనీస్ తైపీ)తో మాళవిక బాన్సోద్, వాంగ్ యి (చైనా)తో తన్విశర్మ తలపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టితో లక్ష్యసేన్, శ్రీకాంత్‌తో తరుణ్ మన్నెపల్లి, లీ చుక్ (హాంకాంగ్)తో హెచ్.ఎస్.ప్రణయ్ పోటీపడనున్నారు. పురుషుల డబుల్స్‌లో చెన్ జి ప్రెస్లీ స్మిత్ (అమెరికా)తో సాత్విక్ చిరాగ్.. మహిళల డబుల్స్‌లో ఓర్నిచా సుకిత (థాయ్‌లాండ్)తో గాయత్రి గోపీచంద్ ట్రీసా జాలీ తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు.

ప్రతిపక్షం

www.prathipaksham.in

హైదరాబాద్

బుధవారం 14.01.2026

సినిమా

ప్రభాస్ క్రేజ్‌ను మించిన రణ్‌వీర్ సింగ్



పాన్ ఇండియా స్టార్ అనగానే టక్కున గుర్తొచ్చే వ్యక్తి రెబల్ స్టార్ ప్రభాస్. బాహుబలి సినిమా తర్వాత వరుస పెట్టి పాన్ ఇండియా చిత్రాలు చేస్తూ యాక్షన్, రొమాంటిక్, కామెడీ చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. అంతేకాదు తన సినిమాలు ఫలితంతో సంబంధం లేకుండా బాక్స్ ఆఫీస్ వద్ద కలెక్షన్లు రాబడుతూ సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తూ దూసుకుపోతున్న పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌నే బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ఇప్పుడు బీట్ చేసి సరికొత్త రికార్డులు క్రియేట్ చేశారు.రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించిన యాక్షన్ డ్రామా చిత్రం ధురంధర్. ఈ సినిమా విడుదలయ్యి 38 రోజులు అవుతున్నా.. ఇప్పటికీ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల జోరు చూపిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తోంది. ముఖ్యంగా బుక్ మై షోలో ఈ ఒక్కరోజే 45 వేలకు పైగా టికెట్లు బుక్ అయ్యి ఆశ్చర్యపరిచింది. ఇటు సంక్రాంతి సినిమాలు బరిలోకి దిగినా ఈ సినిమా దూకుడు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. దీనికి తోడు మరో 10 రోజుల్లో ఓటీటీలోకి వస్తున్నప్పటికీ ప్రేక్షకులు మాత్రం ఇప్పటికీ థియేటర్లకే వెళ్లి ఈ సినిమాను చూస్తూ ఉండడం విశేషం అనే చెప్పాలి.నిజానికి గత కొంతకాలంగా బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరైన సక్సెస్ లేక బాలీవుడ్ బాక్సాఫీస్ వెలవెలబోతున్న సమయంలో తుఫానులా వచ్చి పడింది ధురంధర్. వరుస కలెక్షన్లు రాబడుతూ సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే 1300 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టిన ఈ సినిమా మరోవైపు వరుస రికార్డులు క్రియేట్ చేస్తూ దూసుకుపోతోంది.. ఇకపోతే ఈ సినిమా దూకుడుకి ప్రభాస్ ది రాజాసాబ్ సినిమా అడ్డుకట్ట వేస్తుందని ఇటు సౌత్ ను మొదలుకొని అటు బాలీవుడ్ అభిమానులు కూడా ఆశించారు కానీ ప్రభాస్ సినిమాకే పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.వాస్తవానికి టాలీవుడ్ స్టార్ ప్రభాస్ కి బాలీవుడ్ లో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో కూడా తెలుగులో సగటు విజయాలు సాధించిన ఎన్నో సినిమాలు హిందీలో భారీ వసూళ్లు రాబట్టి ఆయనకు హిందీలో ఊహించిన మార్కెట్ ను అందించాయి. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి సందర్భంగా జనవరి 9న ది రాజాసాబ్ సినిమా విడుదలైంది. అయితే మూడు రోజుల్లో కలిపి కేవలం 15.75 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగింది. ఇక్కడ ఆశ్చర్యం ఏమిటంటే.. విడుదలై 38 రోజులవుతున్నా.. ఈ సినిమా 38వ రోజు కలెక్షన్లను కూడా ది రాజాసాబ్ విడుదలైన 3వ రోజే బ్రేక్ చేయలేకపోతోంది. ముఖ్యంగా 38వ రోజునే హిందీలో 6.5 కోట్లకు పైగా కలెక్షన్లు వసూలు చేసింది ధురంధర్ .సాధారణంగా ఇంతకాలం తర్వాత కూడా సినిమాల కలెక్షన్లు నామమాత్రంగానే వస్తాయి. కానీ ధురంధర్ సినిమా మాత్రం ట్రెండ్ను పూర్తిగా బ్రేక్ చేసి వరుస కలెక్షన్లతో దూసుకుపోతోంది ఇక దీన్ని బట్టి చూస్తే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మూవీని ఈ సినిమా 38వ రోజు కూడా బ్రేక్ చేసింది అంటే దురంధర్ సినిమాకి అభిమానులు ఏ రేంజ్ లో పట్టం కట్టారో అర్థమవుతుంది.పైగా అటు నెల రోజుల్లోనే ఇండియాలో 831.40 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా.. ఇండియా చలనచిత్ర చరిత్రలో సింగిల్ లాంగ్వేజ్ లో మాత్రమే విడుదల ఈ స్థాయి వసూలు సాధించిన తొలి సినిమాగా కూడా రికార్డు సృష్టించింది.



ఎల్లమ్మ అప్డేట్ వచ్చేసింది


జబర్దస్త్ కామెడీ షో ద్వారా ఎంతో మంచి పేరు తెచ్చుకున్న వేణు ఎల్దండి, ఆ తర్వాత పలు సినిమాల్లో కమెడియన్ గా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఓ వైపు కమెడియన్ గా సినిమాలు చేస్తూనే చాలా సైలెంట్ గా డైరెక్టర్ గా మారి బలగం అనే సినిమాను తెరకెక్కించిన వేణు ఆ సినిమా రిలీజయ్యాక చాలా పాపులర్ అయ్యారు. ఒక్క మాటలో చెప్పాలంటే బలగం వేణు కెరీర్ కు టర్నింగ్ పాయింట్ లాంటిది.సినిమాలో కంటెంట్ బావుండి, రిలీజ్ కు ఇబ్బంది పడే చిన్న సినిమాలను రిలీజ్ చేయడమే కాకుండా ఆ రిలీజ్ ను దగ్గరుండి పుష్ చేసే దిల్ రాజు బలగం సినిమాను ఆడియన్స్ లోకి తీసుకెళ్లి దాన్ని బ్లాక్ బస్టర్ గా నిలిపారు. ఆడియన్స్ పల్స్ తెలిసిన వేణు లో మ్యాటర్ ఉందని గమనించిన దిల్ రాజు, తన బ్యానర్ లోనే వేణు రెండో సినిమాను తీసేలా అగ్రిమెంట్ చేసుకున్నారు.అగ్రిమెంట్ జరిగి చాలా కాలమవుతున్నప్పటికీ వేణు డైరెక్టర్ గా రెండో సినిమా ఇప్పటి వరకు మొదలవలేదు. మొదట్లో నాని వద్దకు వెళ్లిన ఈ కథ, తర్వాత శర్వానంద్, నితిన్ వద్దకు వెళ్లింది. నితిన్ తో ఆల్మోస్ట్ సినిమా ఓకే అని అనుకున్న తర్వాత ఇప్పుడతన్ని కూడా కాదని మ్యూజిక్ డైరెక్టర్ దేవీ శ్రీ ప్రసాద్ తో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నట్టు తెలుస్తోంది.అయితే తాజాగా ఈ సినిమా గురించి ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ ను అందించారు డైరెక్టర్ వేణు. సంక్రాంతి సందర్భంగా తన రెండో సినిమాకు సంబంధించిన గ్లింప్స్ ను జనవరి 15వ తేదీ సాయంత్రం 4.05 గంటలకు రిలీజ్ చేయనున్నట్టు చెప్పారు. తన రెండో సినిమా ఎస్వీసీ బ్యానర్ లో దిల్ రాజు నిర్మాణంలోనే ఉంటుందని కూడా వేణు ఈ సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. ఏదేమైనా బలగం రిలీజైన చాలా కాలానికి వేణు రెండో సినిమా గురించి అప్డేట్ వస్తుందని తెలిసి అందరూ హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు. మరి ఈ సినిమాకు దేవీ శ్రీ ప్రసాద్ కేవలం హీరోగానే వ్యవహరిస్తారా లేదా మ్యూజిక్ డైరెక్టర్ గా కూడా బాధ్యతలు తీసుకుంటారా అనేది తెలియాల్సి ఉంది.



బాలీవుడ్‌లో కొత్త వెర్షన్..

హిందీ పరిశ్రమలో ప్రతి దానికి డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందని తాప్సీ అన్నారు. ఇండస్ట్రీలో ఒకరిని పడేయాలన్నా.. మరొకరిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్నా డబ్బే కీలకమైందని చెప్పారు. తాజా ఇంటర్వ్యూలో ఆమె పీఆర్ వ్యవస్థ గురించి మాట్లాడారు.''నేను నా సొంత పనులు చేసుకుంటూ బిజీగా ఉన్నాను. కానీ, ఏడాదిన్నర నుంచి ఇండస్ట్రీలో చాలా మార్పులు వచ్చాయి. పీఆర్ గేమ్ వేరే స్థాయికి వెళ్లిందని నేను గ్రహించాను. ఇక్కడ ప్రతి దానికి డబ్బు చెల్లించాలి. మన ప్రతిభను కూడా డబ్బుతోనే ముడిపెడతారు. మీ విజయం వేరొకరి వైఫల్యంపై ఆధారపడి ఉంటుందనేలా కొత్త వెర్షన్‌ను సృష్టించారు. కానీ, నా మనస్తత్వం పూర్తి భిన్నమైనది. మన పనే మన గురించి చెప్పాలని భావిస్తాను. ఇలాంటి వాటికి డబ్బును వెచ్చించను. నా సొంత పనుల కోసం డబ్బును ఉపయోగిస్తాను. నా ప్రయాణాలు, నా కుటుంబం కోసం ఖర్చు చేస్తాను. నన్ను ప్రశంసిస్తూ వ్యాసాలు రాయడానికి, నన్ను పొగడడం కోసం మాత్రమే సోషల్ మీడియా ఖాతాలకు రూ.50వేలు చెల్లించడానికి నా దగ్గర అంత డబ్బు లేదు'' అని తాప్సీ తెలిపారు.

'కల్కి 2'కి ముహూర్తం పెట్టేసారా?



ఒకేసారి రెండు..మూడు ప్రాజెక్ట్ లు పట్టాలెక్కించడం ప్రభాస్ ప్రత్యేకత. ఏక కాలంలో వాటి షూటింగ్స్ లో పాల్గొనడం లోనూ డార్లింగ్ అంతే ఘనుడు. గత ఏడాది 'రాసాజాబ్', 'ఫౌజీ' షూటింగ్ లతో బిజీగా గడిపాడు. ఎట్టకేలకు రాజాసాబ్ అన్ని అవాంతరాలు దాటుకుని 9న రిలీజ్ అయిపోయింది. ఆ సినిమా ఫలితం సంగతి పక్కన బెడితే? ప్రభాస్ మెరుపు వేగంగా షూటింగ్ పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ లున్నాయి. ఇప్పటికే 'ఫౌజీ' షూటింగ్ చాలా వరకూ పూర్తయింది. భారీ పీరియాడిక్ చిత్రం కావడంతో? రాజాసాబ్ ని పక్కనబెట్టి మరీ 'ఫౌజీ' షూటింగ్ కి హాజరయ్యాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కి బ్రేక్ ఇచ్చి సందీప్ రెడ్డి వంగా ప్రాజెక్ట్ 'స్పిరిట్' ని పట్టాలెక్కించాడు. 'రాజాసాబ్' ప్రచారం అనంతరం డార్లింగ్ విదేశాలకు వెకేషన్ కు వెళ్లాడు. మరో రెండు..మూడు రోజుల్లో తిరిగి రానున్నాడు. సంక్రాంతి సెలవుల అనంతరం తిరిగి 'స్పిరిట్' షూటింగ్ లో పాల్గొంటాడు. ప్రస్తుతం సందీప్ ప్రభాస్ లేని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే 'కల్కి 2' అప్ డేట్ కూడా తెరపైకి వస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరి ముగింపు లేదా మార్చి తొలి వారంలో మొదలు పెట్టాలని దర్శకుడు నాగ్ అశ్విన్ భావిస్తున్నాడుట.ప్రభాస్ లేకుండానే షూట్ ప్లాన్ చేస్తున్నారుట. ప్రభాస్ 'కల్కి 2' లో జాయిన్ అవ్వడానికి మరో రెండు మూడు నెలలైనా సమయం పడుతుందని సమాచారం. ఈలోగా ప్రభాస్ లేని సన్నివేశాలు పూర్తి చేయాలన్ని నాగీ ప్లాన్ కావొచ్చు. ఇలా చేయగలిగితే సమయం చాలా వరకూ కలిసొస్తుంది. ప్రభాస్ వచ్చిన తర్వాతే అన్ని పనులు ఒకేసారి చేయడం కంటే? ముందుగానే మొదలు పెట్టి ప్రభాస్ లేని ప్రధాన నటులపై కీలక సన్నివేశాలు పూర్తి చేయొచ్చు. 'స్పిరిట్' షూటింగ్ కూడా సందీప్ రెడ్డి వేగంగానే పూర్తి చేస్తాడనే ప్రచారం జరుగుతోంది.90 లేదా 120 రోజుల్లోనే 'స్పిరిట్' షూటింగ్ పూర్తి చేయాలని సందీప్ ముందుకెళ్తున్నాడు. ఈనేపథ్యంలోనే నాగీ 'కల్కి 2' తెరపైకి తెస్తున్నట్లు కనిపిస్తోంది. 'ఫౌజీ' షూటింగ్ కోసం ప్రభాస్ ఎన్ని రోజులు కేటాయించాల్సి ఉంటుంది? అన్న దానిపై ఓ క్లారిటీ వస్తే మిగతా షూటింగ్ డేస్ పై మేకర్స్ ఓ అంచనాకి రావొచ్చు. రాజాసాబ్ కోసం లుక్ లో మార్పులు తెచ్చినా? మళ్లీ పాత లుక్ లోకి వెళ్లిపోయాడని రాజాసాబ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ పిక్స్ తో తేలిపోయింది. ఈ నేపథ్యంలో 'ఫౌజీ', 'స్పిరిట్', 'కల్కి 2' కోసం లుక్ పరంగా పెద్దగా ఛేంజస్ కూడా లేనట్లే కనిపిస్తోంది. అలాంటి మార్పులుంటే ఒకేసారి మూడు సినిమా షూటింగ్ లు పూర్తి చేయడం అసాధ్యమే.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200